సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
సోమవారం, 27.07.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 266
పేజీలు: 08 వెల: రూ. 5

# యువతకు కొత్త పిలుపు

'జై జవాన్ - జై కిసాన్ - జై యువ' నినాదంతో సీఎం



- యువతకు చట్టసభల్లో మరింత ప్రాతినిధ్యం కల్పించాలని సీఎం విజ్ఞప్తి
- పోటీ వయోపరిమితి తగ్గింపుపై కేంద్రానికి తెలంగాణ తీర్మానం
- యువశక్తికి రాజకీయాల్లో పెద్దపీట వేయాలని రేవంత్ పిలుపు

02

# కార్గిల్ విజయ్ దివస్

సైన్యం సాహసాలకు భారత్ నివాళి

- 27 ఏళ్ల క్రితం ఏం జరిగింది..
- భారత సైన్యం పాక్ మీద ఎలా గెలిచింది..
- ఆక్రమించుకునేందుకు పాక్ కుట్ర
- 85 రోజుల పోరాటం.. త్రివిధ దళాల విజయకేతనం
- కార్గిల్ యుద్ధంలో మన సైనికుల వీరమరణం
- స్మారకంగా ఏటా జులై 26న విజయ దివస్

**ముద్ర ఢిల్లీ:** భారత సైన్యం పరాక్రమానికి.. తిరుగులేని పోరాటానికి సజీవ సాక్ష్యం కార్గిల్ విజయ్ దివస్. సరిగ్గా 27 సంవత్సరాల క్రితం భారత బలగాలు యుద్ధం చేశాయి. అద్భుతమైన విజయం సాధించాయి.. మంచుకొండల్లో లద్దాక్ ప్రాంతంలో కార్గిల్, ద్రాస్, బటాలిక్ సెక్టార్లలో నాడు పాకిస్తాన్ చొరబాటుదారులు ప్రవేశించారు. ఘాతుకాలకు పాల్పడడం మొదలుపెట్టారు. దీంతో భారత సైన్యం వెంటనే స్పందించింది. సరిగ్గా 1999 మే నెలలో ఆపరేషన్ విజయ్ ను ప్రారంభించింది. వైమానిక దళం.. ఆపరేషన్ సఫేర్ సాగ ర్.. నావికాదళం ఆపరేషన్ తల్వార్ ను మిగతా 02లో



# పాతిక శాతం ఓట్లు గల్లంతు!

## హైదరాబాద్‌కు సర్ షాక్

డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో 11.53 లక్షల పేర్లు మిస్సయ్యే ప్రమాదం

### 'సర్' ప్రక్రియలో 24.33% మంది ఓటర్లు గుర్తింపునకు నోచుకోలేదు

- ఆగస్టు 10 డ్రాఫ్ట్ జాబితాలో పేర్లు లేకపోయే అవకాశం
- ఓటర్ల నిర్లక్ష్యమే ప్రధాన కారణమా?..
- హైదరాబాద్‌లో భారీగా మాయమవుతున్న ఓట్లు
- రాజకీయ పార్టీల్లో ఆందోళన




**ముద్ర హైదరాబాద్:** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో హైదరాబాద్‌లో భారీ సంఖ్యలో ఓట్లు జాబితా నుంచి తప్పిపోయే పరిస్థితి ఏర్పడింది. నగరంలోని మొత్తం 47.36 లక్షల ఓటర్లలో 11.53 లక్షల మంది (24.33 శాతం) ఓటర్లను ఎన్నికల సిబ్బంది గుర్తించలేకపోయారు. దీంతో ఆగస్టు 10న విడుదలయ్యే ముసాయిదా ఓటర్ల జాబితాలో వీరి పేర్లు కనిపించే అవకాశం లేదని తెలుస్తోంది.

ఎన్నికల సంఘం ప్రకారం దాదాపు 99 శాతం ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేసినప్పటికీ, వాటి డిజిటలైజేషన్ 50 శాతం కూడా పూర్తి కాలేదు. అంటే దాదాపు సగం మంది ఓటర్లు ఫారాలు సమర్పించకపోవడం లేదా ప్రక్రియ పూర్తిచేయకపోవడం స్పష్టమవుతోంది. అధికారులు గుర్తించలేకపోయిన ఓటర్లలో కొందరిని 'అబ్సెంట్', మరికొందరిని 'షిఫ్టెడ్', మరికొందరిని 'డెడ్' కేటగిరీల్లో నమోదు చేశారు. అద్దె ఇళ్లు మారడం, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడం వంటి కారణాలతో ఈ పరిస్థితి ఏర్పడినట్లు అధికారులు చెబుతున్నా, ఓటర్ల నిర్లక్ష్యం పెద్ద కారణంగా కనిపిస్తోంది. రాజకీయంగా ఈ పరిణామం అన్ని పార్టీలకూ ఆందోళన కలిగిస్తోంది. ఏ పార్టీకి చెందిన ఓట్లు ఎక్కువగా ప్రభావితమయ్యాయో తెలియకపోవడంతో అధికార, ప్రతిపక్ష పార్టీల్లో ఆందోళన నెలకొంది. మిగతా 02లో

### హైదరాబాద్ ఓటర్ల పరిస్థితి

**మొత్తం ఓటర్లు:** 47.36 లక్షలు
**గుర్తించలేకపోయినవారు:** 11.53 లక్షలు
**ప్రభావిత ఓట్లు:** 24.33%
**ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ:** 99%
**డిజిటలైజేషన్ పూర్తి:** 50% లోపు
**ఆగస్టు 3:** ఫారాల సేకరణ చివరి తేదీ
**ఆగస్టు 10:** ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

# కొమురవెల్లికి రైలు

మల్లన్న దర్శనం ఇక సులభం



- కొమురవెల్లిలో నూతన రైల్వేస్టేషన్ ప్రారంభం
- తీరనున్న భక్తుల ఇబ్బందులు

03

# చిరంజీవి సమయస్ఫూర్తి..

సతీశ్‌రెడ్డి సేవాస్ఫూర్తి




- కళా, రక్షణ రంగాలకు వారి కృషితో తెలుగు వారికి ఘన కీర్తి
- చిరంజీవి సినిమాలకు థియేటర్లో నక్షత్రాలు కట్టాను
- హైదరాబాద్ లో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

03

# ఎదురొడ్డి ఎదిగిన సీజేపీ

కాక్రోచ్ జనతా పార్టీ.. కొత్త తరం రాజకీయ శక్తి

- ఎగతాళి నుంచి ఉద్యమం.. సీజేపీ సంచలనం
- డిజిటల్ నుంచి వీధి వరకు.. సీజేపీ ప్రస్థానం
- జెన్–జీ రాజకీయాల కొత్త ముఖం
- సోషల్ మీడియా నుంచి శక్తిగా సీజేపీ
- కొత్త రాజకీయాలకు నాంది
- ఆన్‌లైన్ ఉద్యమం.. ఆఫ్‌లైన్ ప్రభావం
- సంప్రదాయ రాజకీయాలకు సవాల్

**ముద్ర డెస్క్:** ఇటీవలి కాలంలో భారత రాజకీయాల్లో ఒక కొత్త శక్తి ఆవిర్భవించింది. సంప్రదాయ పార్టీలను అధిగమించి ఇన్‌స్టాగ్రామ్‌లో రెండు కోట్ల మంది అనుచరులను సంపాదించుకున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కేవలం ఆన్‌లైన్ ప్రచారంతో మొదలై, కేంద్ర మంత్రి రాజీనామాకు దారితీసే స్థాయికి చేరుకుంది. ఇది నమోదైన రాజకీయ పక్షం కాదు. జెన్–జీ తరం యువత స్వచ్ఛందంగా నిర్మించుకున్న ఉద్యమం. మిగతా 02లో




# ₹2,278.14 కోట్లు

## ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు నిధులు

- నిధులు మంజూరు చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం
- సర్కార్ జీవో విడుదల
- ఎయిర్ పోర్టు రాకతో ఆదిలాబాద్ జిల్లా ముఖచిత్రం మారబోతుంది

**ముద్ర హైదరాబాద్:** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. కేంద్ర రక్షణ శాఖ, విమానయాన శాఖ జాయింట్ యూజర్ సర్వీస్ లకు ఇదివరకే అనుమతి ఇవ్వడంతో తెలంగాణ ప్రభుత్వం ఎయిర్ పోర్టు మాస్టర్ ప్లాన్ కు అనుగుణంగా భూసేకరణ, అభివృద్ధి పనులకు చర్యలు చేపట్టింది. అంతేకాక ఇటీవల జిల్లా పర్యటనలో సీఎం రేవంత్ ఇచ్చిన హామీ మేరకు రూ. 2,278.14 కోట్ల నిధులు మంజూరు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ అయ్యాయి.రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి వికాస్ రాజ్ జీవో 36 ప్రకారం నిధులు మంజూరు చేయడం ఎయిర్ పోర్ట్ ఏర్పాటులో కీలక పరిణామంగా చెప్పవచ్చు. ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ ఆదిలాబాద్ పర్యటన సందర్భంగా జిల్లా కేంద్రంలో విమానాశ్రయం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే శంకర్ పలు మిగతా 02లో



# పెద్దిసుదర్శన్‌రెడ్డికి గుండెపోటు..

గంటసేపు సీపీఆర్ తర్వాత రెస్పాండ్ అయిన సుదర్శన్ రెడ్డి



- 9 సార్లు సీపీఆర్ చేసి కాపాడిన డాక్టర్ మమతా రెడ్డి
- మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు సుదర్శన్ రెడ్డి తరలింపు



02

# భారత్ అంటే నమ్మకం



ప్రపంచ దేశాలకు భారత్ రక్షణ భాగస్వామి

- రక్షణ ఉత్పత్తి, ఎగుమతుల్లో కొత్త శిఖరాలకు భారత్
- ప్రపంచదేశాలకు విశ్వసనీయ భాగస్వామిగా ఇండియా
- 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ..
- కార్గిల్ అమరవీరులకు ఘన నివాళి

02

# బంగాళాఖాతంలో వాయుగుండం

24 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం

- ఉత్తరాంధ్ర తీరానికి ఈదురుగాలుల హెచ్చరిక
- తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



03

# గొడ్డలి పార్టీతో వేదికలు వద్దు

నేతలకు సీఎం చంద్రబాబు ఆదేశం

- 45 రోజుల డోర్ టు డోర్ ప్రచారానికి సీఎం దిశానిర్దేశం
- కూటమి పాలనను ఇంటింటికీ తీసుకెళ్లాలి:
- స్థానిక ఎన్నికలే లక్ష్యం..

03



## ఇదీ AI ముద్ర

ఐటీ రంగంలో మేటిఅయిన ఆధార్ సృష్టికర్త నీలేఖని నేతృత్వంలో పరీక్షల సంస్కరణల కోసం హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయనున్నట్లు పీఎం మోదీ పేర్కొన్నారు.






సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 27.07.2026
www.mudranews.in | @mudranews



## నిద్రలేమి సంకేతాలు : రోజంతా అలసట



రాత్రి తగినంత సమయం నిద్రపోయినా ఉదయం లేవగానే అలసటగా అనిపించడం నిద్రలేమికి ప్రధాన సంకేతం. రోజంతా శక్తి లేకపోవడం, చిన్న పనులకే త్వరగా అలసిపోవడం కనిపిస్తుంది.

# కార్గిల్ విజయ్ దివస్





(మొదటి పేజీ తరువాయి)

అందుకుంది. పాకిస్తాన్ ఉగ్రవాదులను తరిమికొట్టి తన భూభాగాన్ని తిరిగి స్వాధీనం చేస్తుంది. ఎంతమంది అమరుల త్యాగాల ఫలితంగా.. 60 రోజులు సాగిన యుద్ధం తర్వాత భారత్ విజయాన్ని దక్కించుకుంది.

నాడు కార్గిల్ యుద్ధంలో భారత సైన్యం ప్రదర్శించిన శౌర్యం యావత్ ప్రపంచాన్ని ఆకట్టుకుంది. కేవలం సైన్యం మాత్రమే కాకుండా.. భారత వైమానిక దళం కూడా ఈ పోరాటంలో ముఖ్య భూమిక పోషించింది. నాడు యుద్ధంలో స్క్వాడ్రన్ లీడర్.. ప్రస్తుత గ్రూప్ కెప్టెన్ అలోక్ చౌహాన్ కీలకపాత్ర పోషించారు.

కార్గిల్ ప్రాంతంలో ప్రతీ ఏడాది చలికాలంలో పర్వతాల నుంచి.. రెండు దేశాలకు సంబంధించిన సైన్యాలు కిందికి వచ్చేవి. వాస్తవానికి ఇది నిబంధన కూడా. అయితే పాకిస్తాన్ సైన్యం 1999లో నమ్మకద్రోహానికి పాల్పడింది. భారత సైన్యం దిగివచ్చిన తర్వాత.. అప్రదేశాలను ఆక్రమించడం మొదలుపెట్టింది. ఆయుధాలను.. ఇతర సామాగ్రిని అక్కడ ఏర్పాటు చేసింది. చలికాలం పూర్తి అయిన తర్వాత భారత సైన్యం మళ్లీ ఆ ప్రాంతాలకు వెళ్తుండగా.. పాకిస్తాన్ దుర్మార్గం బయటికి వచ్చింది.. దీంతో పాకిస్తాన్ దుర్మార్గానికి ఖచ్చితమైన జవాబు చెప్పడానికి భారత వైమానిక దళం ఆపరేషన్ సఫేద్ సాగర్ మొదలుపెట్టింది.

పాకిస్తాన్ ముష్కరులు ప్రారంభంలో చొరబాట్లను పరిమితంగానే చేశారు. ఆ తర్వాత మరింత దుర్మార్గంగా వ్యవహరించడం మొదలుపెట్టారు. పాకిస్తాన్ ఆక్రమించిన ప్రాంతాలకు దగ్గరగానే ఆ దేశ సైన్యం ఉంది. అయితే ఇంత సైన్యం ఉన్నప్పటికీ ఆహారం.. ఆయుధ సామాగ్రి సక్రమంగా అందకపోతే యుద్ధం చేయడం కష్టం. అందువల్లే భారత వైమానిక దళం పాకిస్తాన్ స్థావరాల కంటే.. ఆయుధ నిల్వ కేంద్రాలు.. ఆహార పంపిణీ కేంద్రం మీద దాడులు చేసింది. కేవలం శత్రువుల మీద బాంబుదాడులే కాదు.. పాకిస్తాన్ ఆనుపానుల మీద భారత సైన్యం దాడులు చేసింది. దీంతో పాకిస్తాన్ ముష్కరులలో మనోధైర్యం తగ్గిపోయింది.

అందువల్లే భారత సైన్యం విజయం సాధించడం ఈజీ అయిపోయింది. పాకిస్తాన్ ఆక్రమించిన ప్రాంతాలను భారత సైనికులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు.. నాటి యుద్ధంలో భారత సైనికులు ఎత్తైన శిఖరాలను స్వాధీనం చేసుకున్నారు. వైమానిక దళం శత్రువుల వ్యూహాలను ఎప్పటికప్పుడు తొక్కిపెట్టేసింది.

# పాతిక శాతం ఓట్లు గల్లంతు!

(మొదటి పేజీ తరువాయి)

అయితే అసలు సమస్య ఓటర్లలో చైతన్యలేమేనని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. గత రెండు దశాబ్దాలుగా హైదరాబాద్‌లో పోలింగ్ శాతం తక్కువగానే నమోదవుతుండగా, అదే నిర్లక్ష్యం ఇప్పుడు ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో కూడా కనిపిస్తోంది. ఓటు హక్కుపై అవగాహన లేకపోవడం వల్ల చాలామంది ఎన్యుమరేషన్ ఫారాలు నింపడానికే ముందుకు రావడం లేదని అధికారులు చెబుతున్నారు.

ఆగస్టు 3తో ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ ముగియనుండగా, ఆగస్టు 10న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కానుంది. జాబితాలో పేరు లేకపోయిన వారు తర్వాత అవసరమైన ఆధారాలు సమర్పించి తమ ఓటును తిరిగి నమోదు చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ, ఓటర్ల చొరవ లేకపోతే సమస్య మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

## ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు
# రూ.2,278.14 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

దఫాలుగా కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిలను కలిసి ఎయిర్ పోర్ట్ ఆవశ్యకతను వివరించారు. ఇందుకు కేంద్ర రక్షణ శాఖ నుండి ఇటీవల గ్రీన్ సిగ్నల్ లభించింది.

ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా బృందం ఇటీవల క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక అందజేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో బలమైన అడుగులు పడడంతో త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి. ఎయిర్ పోర్టు ఏర్పాటుతో పాటు 2.5 కి. మీ. పరిధిలో రన్ వే, పర్మినల్ ఏర్పాటు చేయనున్నారు. ఉత్తరాది, దక్షిణ రాష్ట్రాలకు మధ్య వారధి గా ఆదిలాబాదులో రక్షణ శాఖ సిబ్బంది శిక్షణకు అనువైన స్థలంగా గుర్తించారు. రాష్ట్ర ప్రభు త్వం ఎయిర్ పోర్ట్ భూసేకరణ, మౌలిక అభివృద్ధి పనులకు రూ. 2,278.14 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అదిలాబాద్ నుండి అనుకుంటా గ్రామం వరకు ఆర్.అండ్.బి తరపున రూ.35 కోట్లు, 2200 ఎకరాల భూ సేకరణకు రూ.1, 510 కోట్లు, హై టెన్షన్ టవర్ల తొలగింపు ప్రత్యామ్నాయ విద్యుదీకరణ నిర్మాణానికి రూ.310 కోట్లు మంజూరయ్యాయి. దీంతో ఆదిలాబాద్ జిల్లా ప్రజల్లో ఒక అభివృద్ధి జరుగుతుందనే నమ్మకం కలిగింది. ఎయిర్ పోర్టు రాకతో ఇక ఆదిలాబాద్ జిల్లా ముఖచిత్రం మారబోతుందని, ఉపాధి అవకాశాలతో జిల్లాలో ఎంతోమంది జీవితాలు బాగుపడతాయన్నారు.



# ఎదురొడ్డి ఎదిగిన సీజేపీ

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టాయి. దీనివల్ల భారత సైన్యం అద్భుతమైన విజయాన్ని

**ఎగతాళి నుంచి ఉద్యమం వరకు..**

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యలు ఈ ప్రచారానికి స్పార్క్‌గా పనిచేశాయి. కొందరు యువతను ఉద్యోగాలు లేని, వృత్తుల్లో లేని, పాత్రికేయులు లేదా సామాజిక మాధ్యమ కార్యకర్తలుగా మారి దాడులు చేసేవారిగా పోల్చడం యువతలో అసంతృప్తిని రేకెత్తించింది. బోస్టన్ యూనివర్సిటీలో చదువుకుని, గతంలో ఆమ్ ఆద్మీ పార్టీలో అనుభవం ఉన్న అభిజీత్ దీప్కే మే 16న ఈ ఆన్‌లైన్ ప్రచారాన్ని ప్రారంభించారు. కొద్ది వారాల్లోనే వేలు, లక్షల మంది యువత చేరడంతో అది వేగంగా విస్తరించింది.

**నాయకత్వం స్వభావం..**

సీజేపీలో ప్రధానంగా పది మంది కీలక వ్యక్తులు ఉన్నారు. అభిజీత్ దీప్కేతోపాటు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా, విజేత దహియా, సోనమ్ వాంగుక్, ప్రకాశ్‌రాజ్, అతుల్ కులకర్ణి, అమూల్య ధవన్, రోనక్ ఖత్రీ, అర్పిత్ శర్మ వంటివారు ముందున్నారు. ఇది అధికారిక రాజకీయ పార్టీ కాదు కాబట్టి సంప్రదాయ నిర్మాణం లేదు. డిజిటల్ వేదికల ద్వారా సమన్వయం, వేగవంతమైన సమాచార ప్రసారం దీని బలం.

**స్పష్టమైన ఎజెండా..**

ఎన్నికల్లో పోటీ చేయమని చెబుతున్న సీజేపీ స్పష్టమైన ఎజెండా కలిగి ఉంది. పదవీ విరమణ తర్వాత ప్రధాన న్యాయమూర్తులకు రాజ్యసభ సభ్యత్వం ఇవ్వకూడదని, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో ఓటు మోసాలు జరిగితే ఎన్నికల కమిషనర్‌ను కఠిన చట్టం కింద అరెస్టు చేయాలని, మహిళలకు చట్టసభలు, మంత్రివర్గంలో సగం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. అంబానీ, అదానీల మీడియా సంస్థల లైసెన్సులు రద్దు చేయాలని, పార్టీ మారిన ఎమ్మెల్యేలు, ఎంపీలను ఇరవై ఏళ్లపాటు పోటీ నుంచి, పదవుల నుంచి నిషేధించాలని కూడా ప్రతిపాదించారు. ఇవి వ్యవస్థాపరమైన సంస్కరణలు, లింగ సమానత్వం, మీడియా స్వేచ్ఛ, రాజకీయ నైతికతపై యువత ఆకాంక్షలను ప్రతిబింబిస్తున్నాయి.

**వీధికెక్కిన ఉద్యమం..**

జూన్ 6న అభిజీత్ దీప్కే అమెరికా నుంచి తిరిగి వచ్చిన తర్వాత జంతర్ మంతర్ వద్ద యువత సమావేశమయ్యారు. డిజిటల్ ప్రచారం కొనసాగిస్తూనే జూన్ 20న జంతర్‌మంతర్ వద్ద ధర్నా తలపెట్టారు. తర్వాతి రోజుల్లో వేలాది మందితో నిరసనలు జరిగాయి. జూన్ 28న సోనమ్ వాంగుక్ నిరాహార దీక్ష ప్రారంభించడంతో ఉద్యమం మరింత బలపడింది. ఈ ఒత్తిడి చివరకు కేంద్ర విద్యా మంత్రి రాజీనామాకు దారితీసింది.

**కొత్త రకం రాజకీయం**

సీజేపీ భారత రాజకీయాల్లో ముఖ్యమైన మార్పును సూచిస్తోంది. సంప్రదాయ పార్టీలు, నిధులు, సంస్థాగత నిర్మాణం లేకుండానే డిజిటల్ మాధ్యమాల ద్వారా వేగంగా మద్దతు సంపాదించి, వీధి ఉద్యమంగా మారి ఫలితం సాధించడం అరుదు. జెన్–జీ తరం నిరుద్యోగం, పరీక్ష వ్యవస్థలో విశ్వసనీయత, రాజకీయ జవాబుదారీతనం వంటి సమస్యలపై తమ అసంతృప్తిని ఇలా వ్యక్తం చేస్తోంది. అయితే ఇలాంటి ఉద్యమాల్లో సవాళ్లు కూడా ఉన్నాయి. నిర్మాణ రహితంగా ఉండటం వల్ల దీర్ఘకాలిక వ్యూహం, అంతర్గత క్రమశిక్షణ కష్టం కావచ్చు. మ్యానిఫెస్టోలోని కొన్ని అంశాలు తీవ్రమైనవి కావడంతో వాటి అమలు సాధ్యతపై చర్చ అవసరం. సీజేపీ యువత రాజకీయ భాగస్వామ్యంలో కొత్త దశను సూచిస్తోంది. సంప్రదాయ వ్యవస్థలపై అసంతృప్తి, సాంకేతిక సాధనాల వినియోగం కలయిక ఇలాంటి ఉద్యమాలను సాధ్యం చేస్తోంది. ప్రజాస్వామ్యంలో ఇలాంటి గొంతులు వినిపించడం ఆరోగ్యకరం. అదే సమయంలో నిర్మాణాత్మక సంభాషణ, వాస్తవిక పరిష్కారాల వైపు దృష్టి సారించడం మరింత ముఖ్యం.

## పెద్ది సుదర్శన్ రెడ్డికి
# గుండెపోటు

**ముద్ర, వరంగల్:** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. కార్డియాక్ అరెస్ట్ కావడంతో మెరుగైన వైద్య చికిత్స కోసం ఆయనను గ్రీన్ చానల్ ద్వారా వరంగల్ నుండి సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. అత్యవసర పరిస్థితుల్లో బాధితుడిని వేగంగా తరలించేందుకు అధికారులు గ్రీన్ చానల్ ఏర్పాటు చేయగా, ఆయన ప్రయాణిస్తున్న అంబులెన్స్ వెంటే బిఆర్ఎస్ ముఖ్య నేతలు కేటీఆర్, హరీశ్ రావు బయలుదేరి వెళ్లారు.

**పరామర్శించిన హరీస్ రావు, కేటీఆర్**

ఉదయం రోహిణి ఆసుపత్రికి తీసుకువచ్చిన సమయంలో కార్డియాక్ అరెస్ట్‌కు గురైన సుదర్శన్‌రెడ్డికి వైద్య బృందం దాదాపు గంటసేపు శ్రమించి సీపీఆర్ చేయగా ఆయన స్పందించారని డాక్టర్ మమతా రెడ్డి తెలిపారు. గుండెకు రక్తాన్ని తీసుకెళ్లే ధమ్మనో ఆర్టీ రక్తనాళంలో రక్తం గడ్డకట్టడం వల్ల బ్లాక్‌లు ఏర్పడ్డాయి. వాటిని కరిగించడానికి ప్రత్యేక ఇంజెక్షన్ ఇచ్చినట్లు వెల్లడించారు. అనంతరం యాంజియోగ్రామ్ నిర్వహించగా ప్రస్తుతం పల్స్ సాధారణ స్థితికి వచ్చిందని, కుటుంబ సభ్యుల విజ్ఞప్తి మేరకు మెరుగైన వైద్యం కోసం వెంటిలేటర్ సహాయంతో గ్రీన్ ఛానెల్ ద్వారా హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. హనుమకొండ రోహిణి ఆస్పత్రి కార్డియాలజిస్ట్ డాక్టర్ మమతా రెడ్డి వైద్య బృందంతో కలిసి నిర్విరామంగా శ్రమించి, రికార్డు స్థాయిలో 9 సార్లు సీపీఆర్ చేసి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డికి ప్రాణదానం చేశారు. 9వ సారి సీపీఆర్ ఫలించి గుండె మళ్లీ కొట్టుకోవడంతో.. ఈ మెడికల్ మిరాకిల్ చేసిన డాక్టర్ మమతపై నాయకులు అభినందనల వర్షం కురిపించారు.

పెద్ది సుదర్శన్‌రెడ్డి గుండెపోటుకు గురయ్యారనే విషయం తెలియగానే బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు వెంటనే ఆసుపత్రికి చేరుకున్నారు. సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన్ను పరీక్షించిన వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స కోసం అంబులెన్స్ వెంటే కేటీఆర్, హరీశ్ రావులు కూడా హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.

మాజీ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆరోగ్యంపై బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు స్పందించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యం స్థిరంగానే ఉందని, కానీ ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ముందు జాగ్రత్తగా హైదరాబాద్‌కు తరలిస్తున్నామని మాజీ మంత్రి హరీష్ రావు తెలిపారు. మరోసారి ఇలాంటి పరిస్థితి రాకుండా మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ యశోదా ఆసుపత్రికి తరలిస్తున్నట్లు వెల్లడించారు. అయితే అంబులెన్స్‌కు ఎలాంటి అడ్డంకులు లేకుండా అందరూ సహకరించి, పక్కకు జరగాలని విజ్ఞప్తి చేశారు.

ఆదివారం ఉదయం మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి చనిపోయారని వార్తలు ప్రచారం అయ్యాయి. అయితే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి అని వస్తున్న వార్తలు అవాస్తవం అని, ప్రస్తుతం చికిత్స నడుస్తుంది.. వెంటిలేటర్ పైన ఉంచామని డాక్టర్ సుధాకర్ రెడ్డి తెలిపారు.

# యువతకు కొత్త పిలుపు

**యువతకు చట్టసభల్లో మరింత ప్రాతినిధ్యం కల్పించాలని సీఎం విజ్ఞప్తి**

**పోటీ వయోపరిమితి తగ్గింపుపై కేంద్రానికి తెలంగాణ తీర్మానం**

**యువశక్తికి రాజకీయాల్లో పెద్దపీట వేయాలని పిలుపు**

**ముద్ర, హైదరాబాద్:** "జై జవాన్ – జై కిసాన్ – జై యువ" అనే నూతన నినాదాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. దేశ భవిష్యత్తు నిర్మాణంలో యువతను మరింత భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. శాసనసభలు, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయోపరిమితిని 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించేలా రాజ్యాంగ సవరణ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

హైదరాబాద్‌లో జాతీయ మీడియా ప్రతినిధులతో జరిగిన సమావేశంలో సీఎం పలు కీలక వ్యాఖ్యలు చేశారు. యువశక్తే దేశ భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాల్లో నాయకత్వ సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్న యువతకు, అదే స్థాయిలో రాజకీయ వ్యవస్థలోనూ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.



ఇటీవల నిర్వహించిన సీబీఎస్ఈ, నీట్ (NEET), నెట్ (NET) తదితర జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో తలెత్తిన సమస్యలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు, వారి కుటుంబాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఆందోళనల సందర్భంగా నమోదైన కేసులను సమీక్షించడంతో పాటు నష్టపోయిన కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

నేటి యువత 21 ఏళ్ల వయస్సులోనే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా సేవలందిస్తోందని, స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు నిర్వహిస్తోందని, ప్రపంచస్థాయి సంస్థలకు నాయకత్వం వహిస్తోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. సాంకేతిక, పరిపాలనా, వ్యాపార రంగాల్లో తమ ప్రతిభను చాటుతున్న యువతకు చట్టసభల్లోనూ తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. 61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటు హక్కు వయస్సును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించిన విషయాన్ని, 73వ, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయస్సును 21 ఏళ్లకు సవరించిన విషయాన్ని సీఎం ప్రస్తావించారు. అదే స్ఫూర్తితో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయస్సును 25 నుంచి 21 ఏళ్లకు, శాసనమండలి, రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయస్సును 30 నుంచి 25 ఏళ్లకు తగ్గించాలని ప్రతిపాదించారు.

ఈ అంశంపై సమగ్ర చర్చ నిర్వహించేందుకు ఆగస్టు నెలలో తెలంగాణ శాసనసభ, శాసనమండలి సంయుక్త సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని రాజకీయ పక్షాల అభిప్రాయాలు స్వీకరించిన అనంతరం పోటీ వయోపరిమితి తగ్గింపును కోరుతూ అధికారిక తీర్మానాన్ని ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

నియోజకవర్గాల పునర్విభజన (Delimitation), పార్లమెంట్ సీట్ల పెంపు, మహిళా రిజర్వేషన్ వంటి అంశాలతో పాటు ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయోపరిమితి తగ్గింపు అంశాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో యువత పాత్రను మరింత విస్తరించడం దేశ భవిష్యత్తుకు అవసరమని తెలిపారు.

# భారత్ అంటే నమ్మకం

**ముద్ర, న్యూఢిల్లీ:** రక్షణ ఉత్పత్తి, రక్షణ సామగ్రి ఎగుమతుల రంగంలో భారత్ కొత్త శిఖరాలను అధిరోహిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆదివారం ప్రసారమైన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యంతో దేశం రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధించే దిశగా వేగంగా ముందుకెళ్తోందన్నారు.

గత కొన్నేళ్లలో క్షిపణి సాంకేతికత, అంతరిక్ష రంగం, స్వదేశీ రక్షణ తయారీ సామర్థ్యాల్లో భారత్ గణనీయమైన పురోగతి సాధించిందని మోదీ తెలిపారు. ఈ అభివృద్ధి వల్ల ప్రపంచ దేశాల విశ్వాసాన్ని భారత్ సంపాదించిందని, రక్షణ సామగ్రి తయారీతో పాటు ఎగుమతుల్లోనూ విశ్వసనీయ భాగస్వామిగా ఎదుగుతోందని చెప్పారు. దేశీయ పరిశ్రమలకు ప్రోత్సాహం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో భారత రక్షణ రంగం మరింత బలోపేతమవుతోందన్నారు.

కార్గిల్ విజయ్ దివస్‌ను ప్రస్తావించిన ప్రధాని, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన కార్గిల్ అమరవీరులకు నివాళులర్పించారు. వారి త్యాగం దేశ ప్రజలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని, దేశ భద్రత కోసం సాయుధ దళాలు చేస్తున్న సేవలు అమూల్యమైనవని కొనియాడారు. రక్షణ రంగంలో స్వదేశీ సామర్థ్యాల పెంపుతో భారత్ ప్రపంచ వేదికపై మరింత బలమైన దేశంగా నిలుస్తోందన్నారు.

# బాలకృష్ణను పరామర్శించిన సీఎం చంద్రబాబు

**ముద్ర, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ (ఏఐజీ) ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రముఖ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను సీఎం చంద్రబాబు నాయుడు ఇవాళ పరామర్శించారు. వారం సినిమా షూటింగ్‌లో గాయపడిన బాలకృష్ణకు ఇటీవల మోకాలికి విజయవంతంగా శస్త్రచికిత్స జరిగిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా చంద్రబాబు.. తన బావమరిది అయిన బాలకృష్ణ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన ఎంత వేగంగా కోలుకుంటున్నదీ వాకబు చేశారు. అనంతరం వైద్యులతో ప్రత్యేకంగా మాట్లాడి బాలకృష్ణకు అందిస్తున్న చికిత్స, తదుపరి పునరావాస ప్రణాళికల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



21న రాజమండ్రిలో గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఓ సినిమా షూటింగ్‌లో పాల్గొన్నప్పుడు బాలకృష్ణ ప్రమాదవశాత్తు గాయపడ్డారు. ఆయన ఎడమ మోకాలికి తీవ్ర గాయం కావడంతో మరుసటి రోజే ఆయన్ను ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు తరలించి ఏఐజీ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్య పరీక్షల అనంతరం బాలకృష్ణ ఎడమ కాలి క్వాడ్రిసెప్స్ టెండన్ (తొడ కండరాన్ని మోకాలి చిప్పకు కలిపే కణజాలం) చిరిగిందని, మోకాలికి ఇరువైపులా ఉన్న సహాయక కణజాలాలు కూడా దెబ్బతిన్నాయని వైద్యులు నిర్ధారించారు.

దీంతో ఈ నెల 23న వైద్యులు ఆయనకు విజయవంతంగా శస్త్రచికిత్స పూర్తి చేశారు. దాదాపు మూడు గంటల పాటు జరిగిన ఈ ఆపరేషన్‌లో గాయం చుట్టూ పేరుకుపోయిన రక్తాన్ని తొలగించి, చిరిగిన టెండన్‌ను మోకాలి చిప్పకు తిరిగి అతికించామని, దెబ్బతిన్న కణజాలాలకు మరమ్మతులు చేశామని ఆసుపత్రి వర్గాలు మెడికల్ బులెటిన్‌లో తెలిపాయి. ప్రస్తుతం బాలకృష్ణ ఆరోగ్యం నిలకడగా ఉందని, నిపుణుల బృందం పర్యవేక్షణలో ఉన్నారని పేర్కొన్నాయి.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 27.07.2026
www.mudranews.in | @mudranews



## నిద్రలేమి సంకేతాలు : ఏకాగ్రత తగ్గడం, జ్ఞాపకశక్తి బలహీనపడడం

పని లేదా చదువుపై దృష్టి నిలవక పోవడం, చిన్న విషయాలను కూడా మర్చిపోవడం జరుగుతుంది. నిర్ణయాలు తీసుకోవడంలో కూడా ఇబ్బందులు ఎదురవుతాయి.



# బంగాళాఖాతంలో వాయుగుండం

**24 గంటల్లో తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం**
**ఉత్తరాంధ్ర తీరానికి ఈదురుగాలుల హెచ్చరిక**
**మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దు**
**తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**



**ముద్ర, హైదరాబాద్ :** వాయవ్య బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడింది. రానున్న 24 గంటల్లో ఇది తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. సోమవారం పారాదీప్–సాగర్ ద్వీపాల మధ్య తీరం దాటే అవకాశం ఉందని పేర్కొంది. వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్ర తీరం వెంబడి గంటకు 55–65 కి.మీ వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశముందని వివరించింది. సముద్రం అలజడిగా ఉంటుందని.. తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

## మూడు దశాబ్దాల తర్వాత గురు-శిష్యుల అపూర్వ కలయిక

**ఘనంగా శంకర్‌పల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం.**
**పూల జల్లులు కురిపిస్తూ ఉపాధ్యాయులను వేదికపైకి తీసుకెళ్లిన నాటి విద్యార్థులు.**




**ముద్ర, శంకర్ పల్లి :** గురువు చూపిన బాటే జీవితానికి వెలుగుబాట అని, విద్యార్థుల విజయంలో ఉపాధ్యాయుల పాత్ర చిరస్మరణీయమని శంకర్‌పల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పేర్కొన్నారు.శంకర్‌పల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1995–96 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సుమారు మూడు దశాబ్దాల అనంతరం ఆదివారం ఒకే వేదికపై కలుసుకుని భావోద్వేగభరితంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు నాగభూషణం, అలీ అదిల్ ఖాన్, అనసూయ దేవి, యాదయ్య, సత్యనారాయణ, నారాయణ, భాస్కర్, ఆఫీస్ సబ్ ఆర్డినేట్ చాంద్ సుల్తాన్‌లను పూల వర్షం కురిపిస్తూ ఘనంగా వేదికపైకి ఆహ్వానించి శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించారు. కార్యక్రమానికి అమెరికాలో ఉన్న అప్పటి ఉపాధ్యాయులు రామాంజనేయులు ఆన్‌లైన్ ద్వారా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు.సుమారు వంద మంది పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై చేరి పాఠశాల రోజులలోని మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. మూడు దశాబ్దాల కాలంలో జీవితంలో సాధించిన విజయాలు, ఎదురైన అనుభవాలను ఒకరితో ఒకరు పంచుకుంటూ ఆత్మీయంగా గడిపారు.

కార్యక్రమాన్ని పాఠశాల పూర్వ విద్యార్థి, జిల్లా జర్నలిస్టు యూనియన్ అధ్యక్షులు ఎండీ సలీమ్ పాషా సమర్థవంతంగా నిర్వహించారు. తన వ్యాఖ్యానంతో నాటి పాఠశాల వాతావరణాన్ని మరోసారి గుర్తు చేస్తూ గురు–శిష్య బంధం గొప్పతనాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు నాగభూషణం, అలీ అదిల్ ఖాన్, అనసూయ దేవి లు మాట్లాడుతూ "మూడు దశాబ్దాల తర్వాత తమ విద్యార్థులను మళ్లీ చూడటం జీవితంలో మరచిపోలేని అనుభూతి అని అన్నారు. గురువుకు నిజమైన సంపద తన విద్యార్థుల విజయమే అన్నారు. ఈ రోజు మా ముందున్న ప్రతి విద్యార్థి సమాజంలో మంచి స్థాయికి చేరుకోవడం మాకు ఎంతో గర్వకారణమని, ఇలాంటి సమ్మేళనాలు కేవలం జ్ఞాపకాలను మాత్రమే కాదని, మనసులను కూడా కలుపుతాయని, ఆయుష్షు ను పెంచుతాయాన్నారు.. గురువులను గుర్తు పెట్టుకుని ఇంత ఘనంగా సన్మానించడం ఎప్పటికి గుర్తుండి పోతుందని,ప్రతి విద్యార్థికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఇలాంటి ఆప్యాయత, ఆత్మీయత మన ఆయుష్షును కూడా పెంచుతుందని, పాత జ్ఞాపకాలుబంగారు ఘని లాంటివి అని అన్నారు.గురు–శిష్య బంధం ఎప్పటికీ చెదరని అనుబంధం" అని పేర్కొన్నారు.ఉపాధ్యాయులు నారాయణ, యాదయ్య,సత్యనారాయణ, భాస్కర్ లు మాట్లాడుతూ 1995–96 బ్యాచ్ విద్యార్థులు చదువుకున్న పాఠశాల ఆవరణలో శాశ్వత వేదిక (స్టేజి) నిర్మించి పాఠశాలకు అందించడం అభినందనీయమన్నారు.పూర్వ విద్యార్థుల సామాజిక సేవను కొనియాడారు. విద్యార్థులు తమ పాఠశాల అభివృద్ధికి చేయూతనివ్వడం ఇతర బ్యాచ్‌లకు కూడా స్ఫూర్తిదాయకమని అన్నారు.ఇలాంటి కార్యక్రమాలు కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకే సాధ్యపాడుతాయాన్నారు. పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, "మనకు అక్షరాభ్యాసం నేర్పి, జీవితానికి దిశానిర్దేశం చేసిన గురువులను సన్మానించడం మా అదృష్టంగా భావిస్తున్నామన్నారు. నేడు మేము ఏ స్థాయిలో ఉన్నామన్నా దానికి పునాది వేసింది మా పాఠశాల, మా గురువులేనని" పేర్కొన్నారు.కార్యక్రమం ప్రారంభానికి ముందు గత మూడు దశాబ్దాల కాలంలో మరణించిన ఉపాధ్యాయులు, సహచర విద్యార్థుల ఆత్మశాంతి కోసం రెండు నిమిషాల మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రతి పూర్వ విద్యార్థి తనను తాను పరిచయం చేసుకుంటూ నాటి పాఠశాల జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాఠశాల రోజులలో జరిగిన సరదా సంఘటనలు, ఉపాధ్యాయుల బోధన, స్నేహబంధాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు.చివరగా అందరూ మరోసారి ఇలాంటి సమ్మేళనాలు నిర్వహిస్తూ గురు–శిష్య బంధాన్ని మరింత బలోపేతం చేయాలని సంకల్పించారు. ఆత్మీయ వాతావరణంలో, పూర్వ విద్యార్థి వినోద్ కుమార్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

### శ్రీరాంసాగర్ జలాశయంలో ఈతకు దిగి ముగ్గురి మృతి

ముద్ర, నిజామాబాద్: నిజామాబాద్ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. శ్రీరాంసాగర్ జలాశయం (ఎస్సారెస్పీ)లో ఈతకు దిగి ముగ్గురు యువకులు మృతిచెందారు. ముప్కాల్ వద్ద ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో ఈతకు దిగిన ఐదుగురు యువకులు నీటమునిగి గల్లంతయ్యారు. వీరిలో ముగ్గురు చనిపోగా, ఒకరు గల్లంతయ్యారు. మరొకరు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. మృతదేహాలను స్థానికులు వెలికితీశారు. మృతులు నిజామాబాద్‌కు చెందినవారిగా సమాచారం. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కొమురవెల్లికి రైలు

**కొమురవెల్లిలో నూతన రైల్వేస్టేషన్ ప్రారంభం**
**తీరనున్న భక్తుల ఇబ్బందులు**



**ముద్ర సిద్దిపేట :** సిద్దిపేట జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లిలో నూతన రైల్వేస్టేషన్‌ను కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ దత్తాత్రేయ, ఎంపీలు లక్ష్మణ్, రఘునందన్‌రావు, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కొమురవెల్లి పుణ్యక్షేత్రంలో రైల్వేస్టేషన్‌ను ప్రారంభించడం చరిత్రాత్మక ఘట్టమన్నారు. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి మల్లన్న దర్శనానికి వచ్చే భక్తులకు ఈ స్టేషన్ ద్వారా ప్రయాణం సౌకర్యవంతంగా మారుతుందని చెప్పారు.

మల్లన్న భక్తులు కొమురవెల్లి చేరుకునేందుకు ప్రస్తుతం బస్సులు, ఇతర వాహనాల్లో వస్తున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల నుంచి వచ్చే భక్తుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. బస్సుల్లో వచ్చే భక్తులు రాజీవ్ రహదారి నుంచి మూడు కిలోమీటర్ల దూరం ఉన్న కొమురవెల్లికి చేరుకోవడానికి, తిరిగి ఇంటికి వెళ్లేందుకు ప్రధాన రహదారిపై గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చేది. రోడ్డు ప్రయాణం ద్వారా హైదరాబాద్ నుంచి సుమారు 110 కిలోమీటర్లు, కరీంనగర్ నుంచి 90 కిలోమీటర్లు ప్రయాణం చేస్తూ రెండు మూడు వాహనాలు మారాల్సి వస్తోంది. చేర్యాల, మద్దూరు, ధూల్మిట్ట మండలాల ప్రజలకు సైతం రైలు ప్రయాణం అందుబాటులోకి రానుంది. చదువుల కోసం వెళ్లే విద్యార్థులు, చిరు వ్యాపారులు నిత్యం సుమారు 100 నుంచి 200 మంది వెళ్తుంటారు. హైదరాబాద్ నుంచి ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల్లో వచ్చే వారికి ఒక్కొక్కరికి సుమారు రూ.100 నుంచి రూ.200, కరీంనగర్ నుంచైతే రూ.100– 150 ఖర్చు తప్పదు. రైలు ప్రయాణమైతే సగం ఖర్చు భారం తగ్గుతుందని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# చిరంజీవి సమయస్ఫూర్తి.. సతీశ్‌రెడ్డి సేవాస్ఫూర్తి

**కళా, రక్షణ రంగాలకు వారి కృషితో తెలుగు వారికి ఘన కీర్తి**
**చిరంజీవి సినిమాలకు థియేటర్లో నక్షత్రాలు కట్టాను**
**హైదరాబాద్ లో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్**




**ముద్ర, హైదరాబాద్ :**కళారంగంలో మెగాస్టార్ చిరంజీవి, రక్షణ రంగంలో శాస్త్రవేత్త జి.సతీశ్‌రెడ్డి తెలుగు ప్రజలు గర్వించదగ్గ ప్రముఖులని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ కొనియాడారు. చిరంజీవి తన నటనతో కోట్లాది మంది హృదయాలను గెలుచుకోగా, సతీశ్‌రెడ్డి దేశ రక్షణ రంగాన్ని బలోపేతం చేసిన మేటి శాస్త్రవేత్తగా నిలిచారని పేర్కొన్నారు. హైదరాబాద్ లో ఆదివారం బీవీ పట్టాభిరామ్ పేరుతో ఏర్పాటు చేసిన తొలి పురస్కారాన్ని సతీశ్‌రెడ్డికి ప్రదానం చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవిపై తనకున్న అభిమానాన్ని, సతీశ్‌రెడ్డితో ఉన్న 35 ఏళ్ల అనుబంధాన్ని సత్యకుమార్ గుర్తుచేసుకున్నారు.

**చిరంజీవి సినిమాలకు నక్షత్రాలు కట్టాను**

తాను 15 ఏళ్ల వయసులో బళ్లారిలో పీయూసీ చదువుతున్న సమయంలో చిరంజీవి సినిమా విడుదలైతే థియేటర్ వద్ద పెద్ద నక్షత్రాలను కట్టేవారమని మంత్రి తెలిపారు. 'కిరాతకుడు' సినిమా విడుదలైనప్పుడు రాత్రంతా థియేటర్ వద్ద ఉండి నక్షత్రం కట్టామని, ఆ తర్వాత 'దొంగ మొగుడు' చిత్రానికీ అదే విధంగా చేసినట్లు గుర్తుచేశారు. ''ఆ సినిమా పేర్లలో కాస్త ప్రతికూలత కనిపించవచ్చు. కానీ చిరంజీవిగారిలో మాత్రం అలాంటి ప్రతికూలత ఏ కోశానా లేదు. ఆయన మంచి మనసున్న మెగాస్టార్'' అని సత్యకుమార్ వ్యాఖ్యానించారు. సాధారణంగా వయసు పెరుగుతున్న కొద్దీ వృద్ధాప్యం వస్తుందని అంటారని, చిరంజీవి, సతీశ్‌రెడ్డిని చూస్తే మాత్రం రోజురోజుకూ మరింత యువకులుగా, ఉత్సాహంగా కనిపిస్తున్నారని మంత్రి చమత్కరించారు.

**కలాం మాటను నిజం చేసిన సతీశ్‌రెడ్డి**

సతీశ్‌రెడ్డితో తనకు విద్యార్థి దశ నుంచి పరిచయం ఉందని సత్యకుమార్ తెలిపారు. సతీశ్‌రెడ్డి ప్రతిభను మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం పాతికేళ్ల క్రితమే గుర్తించారని చెప్పారు. ''సతీశ్‌రెడ్డి ఎంతో ప్రతిభావంతుడు. ఒకరోజు దేశానికి శాస్త్రీయ సలహాదారుగా, డీఆర్‌డీవో అధిపతిగా ఎదుగుతారు'' అని కలాం అప్పట్లో చెప్పిన మాటలను గుర్తుచేశారు.

ఆ తర్వాత శ్రీ వెంకయ్యనాయుడు కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో అదనపు వ్యక్తిగత కార్యదర్శిగా రావాలని సతీశ్‌రెడ్డిని కోరారని మంత్రి తెలిపారు. ఆ విషయంపై తన సలహా అడిగినప్పుడు రాజకీయ పదవులవైపు కాకుండా శాస్త్రరంగంలోనే కొనసాగాలని చెప్పినట్లు వివరించారు. ''అబ్దుల్ కలాం వంటి గొప్ప శాస్త్రవేత్త ఆయన భవిష్యత్తును అప్పుడే గుర్తించారు.

**ఆయన జ్ఞానంతో నాకు చప్పట్లు...**

ఒక కార్యక్రమంలో రక్షణ రంగంపై మాట్లాడాల్సి వచ్చినప్పుడు సభకు కొద్దిసేపటి ముందు ఆయనకు ఫోన్ చేసినట్లు చెప్పారు. ఆ సమయంలో తీరిక లేకుండా ఉన్నప్పటికీ 15 నిమిషాల్లోనే రక్షణ రంగంలో వచ్చిన మార్పులు, దేశీయ తయారీ, ఎగుమతులు, యుద్ధ విమానాల తయారీపై పూర్తి సమాచారం పంపించారని తెలిపారు. ఆ వివరాలను గుర్తుపెట్టుకొని నేను సభలో మాట్లాడాను. ప్రసంగం పూర్తయ్యాక రక్షణ రంగంపై నాకు ఎంతో పరిజ్ఞానం ఉందని అందరూ అభినందించారు. నిజానికి ఆ జ్ఞానం నాది కాదన్నా రు.

ఒకప్పుడు చిన్న రక్షణ పరికరాలను కూడా విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న భారత్.. ఇప్పుడు యుద్ధ విమానాలు, క్షిపణులు, ఆధునిక రక్షణ సామగ్రిని స్వదేశంలో తయారు చేసి ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరిందన్నారు. ఈ మార్పులో సతీశ్‌రెడ్డి పాత్ర కీలకమని చెప్పారు.

**కరోనా వేళ దేశానికి అండగా**

కరోనా మహమ్మారి సమయంలో సతీశ్‌రెడ్డి నాయకత్వంలోని డీఆర్‌డీవో దేశానికి అండగా నిలిచిందని మంత్రి తెలిపారు. దేశంలో పీపీఈ కిట్లు, ఎన్–95 మాస్కులు, వెంటిలేటర్లు అందుబాటులో లేని సమయంలో వాటిని స్వదేశంలోనే తయారు చేశారని గుర్తుచేశారు. సతీశ్‌రెడ్డి శాస్త్రవేత్తగానే కాకుండా సామాజిక స్పృహ కలిగిన వ్యక్తని మంత్రి ప్రశంసించారు.

**ఏపీ కోసం కృషి**

పదవీ విరమణ అనంతరం కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ శాస్త్రీయ సలహాదారుగా రాష్ట్రానికి రక్షణ, వైమానిక రంగ పరిశ్రమలను తీసుకురావడానికి సతీశ్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. పెట్టుబడులు తీసుకురావడంతోపాటు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఆయన సేవలు అభినందనీయమన్నారు.

**శ్రోతగా పిలిచి వక్త ను చేశారు**

బీవీ పట్టాభిరామ్ పేరుతో ఏర్పాటు చేసిన తొలి పురస్కారాన్ని సతీశ్‌రెడ్డికి, చిరంజీవి ముఖ్య అతిథిగా పాల్గొన్న సభలో అందించడం ఎంతో ప్రత్యేకమన్నారు. కార్యక్రమానికి శ్రోతగా వచ్చిన తనను వేదికపైకి ఆహ్వానించి వక్త గా మాట్లాడే అవకాశం కల్పించిన ఎమెస్కో విజయకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# గొడ్డలి పార్టీతో వేదికలు పంచుకోవద్దు..

**నేతలకు సీఎం చంద్రబాబు ఆదేశం**
**45 రోజుల డోర్ టు డోర్ ప్రచారానికి సీఎం దిశానిర్దేశం**
**కూటమి పాలనను ఇంటింటికీ తీసుకెళ్లాలి: సీఎం**
**స్థానిక ఎన్నికలే లక్ష్యం.. ప్రజల్లో ఉండాలని నేతలకు సూచన**



**ముద్ర, అమరావతి:** గొడ్డలి పార్టీ నేతలతో ఎట్టి పరిస్థితుల్లోనూ వేదికలు పంచుకోవద్దని ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు పార్టీ నేతలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పార్టీ ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ, గొడ్డలి పార్టీ ఒక "విషవృక్షం" అని అభివర్ణించారు. కులాలు, మతాలను అడ్డం పెట్టుకుని సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టడమే ఆ పార్టీ రాజకీయంగా చేసుకుంటోందని విమర్శించారు. ఆ పార్టీ ట్రాప్‌లో ఎవరూ పడొద్దని నేతలకు సూచించారు.కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా రేపటి నుంచి 45 రోజుల పాటు నిర్వహించనున్న డోర్ టు డోర్ కార్యక్రమంపై కూడా సీఎం దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న విషయాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రజలు వ్యక్తం చేసే సందేహాలను ఓర్పుతో నివృత్తి చేయాలని చెప్పారు.

గత ఎన్నికల్లో ప్రజలు కూటమికి చారిత్రాత్మక విజయాన్ని అందించారని, 94 శాతం స్ట్రైక్‌రేట్‌తో 57 శాతం ఓట్లు సాధించామని చంద్రబాబు గుర్తు చేశారు. గత ప్రభుత్వ విధ్వంసకర పాలన కారణంగానే 151 సీట్లు గెలిచిన పార్టీ 11 స్థానాలకు పరిమితమైందన్నారు. టీడీపీతో పాటు కూటమి భాగస్వామ్య పార్టీల పోరాటం, వ్యూహాల వల్లే ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలను గెలుచుకోవడమే లక్ష్యంగా పని చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. టీడీపీతో పాటు కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. బూత్ కన్వీనర్ల నుంచి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వరకు అందరూ ప్రజల్లోకి వెళ్లి అవుట్‌రీచ్ కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు.

"నాకు కావాల్సింది అనుచరులు కాదు.. పార్టీకి నాయకులు కావాలి" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. సమస్యలకు పరిష్కారం చూపే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని, ప్రజలు, కార్యకర్తలతో ఎప్పుడూ సన్నిహితంగా ఉండాలని సూచించారు. కష్టంతో కాకుండా ఇష్టంతో పని చేయాలని చెప్పారు.

యువత సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలతో పాటు, గొడ్డలి పార్టీ యువతను ఎలా నిర్వీర్యం చేసిందో కూడా ప్రజలకు వివరించాలని చంద్రబాబు అన్నారు. డబ్బు మాత్రమే ఉంటే ప్రజాభిమానం దక్కదని, 2024 ఎన్నికల ఫలితాలు అందుకు నిదర్శనమని పేర్కొన్నారు.గొడ్డలి పార్టీ తప్పుడు విధానాలు, విధ్వంసకర రాజకీయాలను ప్రజల్లో ఎండగట్టాలని, ప్రజలతో నిరంతరం మమేకమైతే వారి కుట్రలను బహిర్గతం చేయవచ్చని చంద్రబాబు అన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి కోసం కొనసాగాల్సిన అవసరాన్ని ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా వివరించాలని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
సోమవారం 27.07.2026



## వేదిక
Peoples Voice

మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# ఇరువురి మహాకవుల మైత్రి బంధం..

ఇరువురి మహాకవుల మైత్రి బంధం.. బహు కవితా మధురం... వారే మహాకవి గుర్రం జాషువా – మహాకవి దుర్గానంద్. ఇరువురి మధ్య వయసు బేధం 32 సంవత్సరాలు.ఇది బాహ్య బేధం... కానీ వారిమనో కవిత్వ బంధం మహోన్నతం. 1954 లో.. జాషువా వారి కమనీయ కవితా ఝరి 'ఫిర దౌసి ' ని చతుర్భాషా కవి కోవిదుడు దుర్గానంద్ హిందీ భాషలోకి అనువదించి.. గురు సమానులైన జాషువా గారితోనే ఔ రా.. అనిపించుకున్నారు.... హిందీ కవితా లోకంలో జాషువా కవితా ప్రతిభ మిలమిల లాడినది.. ఆ తరుణంలోనే జాషువా గారు... దుర్గానంద్ గారితో " నన్ను హిందీలోకి తీసుకెళుతున్నావా దుర్గానంద్ " అంటూ వాత్సల్యంగా అన్నారంటే వారి మధ్య స్నేహం ఎంతో లోతైనది.1950 దశకంలోనే, తెలుగు స్వతంత్రపత్రికలో ప్రచురితమవుతున్న దుర్గానంద్ అభ్యుదయ కవితలు చదువుతుండేవారు జాషువా..దుర్గానంద్ తొలి అభ్యుదయ రస కవితల సంకలనమే 'అంతర్గోళాలు'. ఈ గ్రంథాన్ని 1956 సంవత్సరంలో తెనాలి శిక్షక్ పబ్లిషర్స్ తొలిగా ముద్రించారు. ఈ సంకలన గ్రంథంలో సుదీర్ఘముఖ పంక్తి రాసింది మహాకవి జాషువా గారే.. అంతర్గోళాల్లో ప్రతి కవితను జాషువా



స్పృశిస్తూ, అద్భుతంగా దుర్గానంద్ ని అభినందించారు. దుర్గానంద్ కవిత్వంలో క్రొత్త ఆరుణ్యం క్రొత్త శబ్దాలు క్రొత్త భేరీలు వినిపించినవి. శాస్త్రవాదాన్ని ఊతగా గొని కావ్య పరిధు ల్ని పెంచుతున్నాడు అన్నారు. శాస్త్రవాద ప్రయోగ ఫలితంగా దుర్గానంద్ కవిత్వం ముమ్ముందు చాలా శక్తివంతమైన కవిత్వంగా రూపొందే సూచనలు కానవస్తున్నవి.ఈ అంతర్గోళాల్లోనే అట్టి కవిత్వాలున్నవి.ఆల్బమ్, ముక్తి, ఘర్షణ, శోకసభలు, ఆంధ్ర శిబి, టీచరు, తాగుబోతు లాంటి గేయాలు అసామాన్యములైనవి. వీటి మీద ఎవరి ప్రభావము లేదు. ఇవి ఇతని శాస్త్రవాద ప్రయోగం సాధించిన నిగ్గులు. వీటిల్లో కవి వ్యక్తిత్వం రక్త రమణీయం రస స్యంది ... అని ముఖ పంక్తిని ముగించారు జాషువా... ఆయన గుంటూరులో ఉపాధ్యాయ గిరిలో ఉంటే, దుర్గానంద్ తెనాలి హిందీ ప్రేమమండలి కళాశాలలో ఉపన్యాసకునిగా ఉద్యోగి. ఇరువురు తరచుగా కలుసుకుని గంటల గంటలు చర్చించుకునేవారు. జాషువా గారు తెనాలి వచ్చినప్పుడు.. దుర్గానంద్ కలిసి ముచ్చటించుకుని.. రత్నా టాకీస్ లో సినిమా చూసేవారు.. ఇలా అనేక సార్లు.... జాషువా గారంటే దుర్గానంద్ కు అమిత గౌరవం, ప్రేమ వాత్సల్యం... అనేక కవితా వ్యసాల్లో దుర్గానంద్.. జాషువా గారి కీర్తిని సువర్ణాక్షరాలతో లిఖించేవారు... జాషువా వారి అంతిమ శ్వాస తరుణంలో..... దుర్గానంద్ ఒకటే అన్నారు.. "అస్తమించని సూర్యుడు జాషువా.".అని . దుర్గానంద్, మహాకవి జాషువా గురించి రాసిన సమగ్ర రచనను... త్వరలో మహాకవి దుర్గానంద్ సాహితీ వేదిక లో వెల్లడి చేసెదము..

**- ధన్యవాదములు**
**చక్రాల రేవతీ నంద్**

# ప్రధానుల తల వంచిన ప్రజా ఉద్యమాలు..






ప్రజా ఉద్యమాలు భారత దేశానికి కొత్తకాదు. మన స్వాతంత్ర్యమే ప్రజా ఉద్యమాలతో సాధించుకున్నాం. స్వతంత్ర భారతదేశంలో ప్రజా ఉద్యమాలు ప్రభుత్వాలపై గణనీయమైన ప్రభావం చూపాయి. కొన్ని సందర్భాల్లో ప్రధానులు విధానాలను వెనక్కి తీసుకున్నారు. మరికొన్ని సందర్భాల్లో ప్రజా ఆగ్రహం ఎన్నికల ఓటమికి దారితీసింది. ఇటీవలి నీట్ వివాదం, రైతు చట్టాలు వంటి సంఘటనలతోపాటు, ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ కూడా ముఖ్యమైన అంశం.

**హిందీ వ్యతిరేక ఉద్యమం.**

తమిళనాడులో హిందీ విధింపుకు వ్యతిరేకంగా 1965లో విద్యార్థులు, ప్రజలు తీవ్ర నిరసనలు చేశారు. అల్లర్లు, హింసాత్మక సంఘటనలు జరిగాయి. ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి ఆకాశవాణి ద్వారా ప్రకటన చేసి, ఆంగ్లం కొనసాగుతుందని హామీ ఇచ్చారు. దీనితో భాషా విధానంలో మార్పు వచ్చింది.

**షా బానో కేసు..**

1986లో సుప్రీంకోర్టు తీర్పుపై ముస్లిం సంప్రదాయవాద వర్గాల నుంచి తీవ్ర ఒత్తిడి వచ్చింది. దీంతో అప్పటి రాజీవ్‌గాంధీ ప్రభుత్వం ముస్లిం మహిళల రక్షణ చట్టం తీసుకొచ్చి తీర్పు ప్రభావాన్ని తగ్గించింది. ఇది నిర్దిష్ట సమాజ ఒత్తిడికి స్పందనగా నిలిచింది.

**భూసేకరణ సవరణలు, రైతు చట్టాలు..**

భూసేకరణ చట్ట సవరణలపై రైతులు, ప్రతిపక్షాల నిరసనల కారణంగా ప్రభుత్వం కఠినమైన మార్పులను వదిలేసింది. ఇక నరేంద్రమోదీ ప్రభుత్వం 2020లో తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలపై ఏడాది పాటు సుదీర్ఘ నిరసనలు జరిగాయి. 2021లో ప్రధాని మోదీ చట్టాలను ఉపసంహరించుకుని, రైతులకు బహిరంగంగా క్షమాపణ చెప్పారు.

**నీట్ వివాదం..**

మెడికల్ కళాశాలల్లో ప్రవేశానికి దేశవ్యాప్తంగా నిర్వహించే నీట్ పేపర్ ఈ ఏడాది లీక్ అయింది. గతేడాది కూడా లీక్ అయింది. లక్షల మంది విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. ఈఏడాది 27 మంది ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో విద్యార్థుల ఉద్యమం తీవ్రమైంది. ప్రధాన డిమాండ్‌గా ఉన్న విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా జరిగింది. ఇది ప్రజా ఒత్తిడికి ప్రభుత్వం స్పందించిన సంఘటన.

**ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ..**

1975 జూన్ 25న ప్రధాని ఇందిరా గాంధీ అంతర్గత అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించారు. జయప్రకాశ్ నారాయణ్ నాయకత్వంలోని సంపూర్ణ విప్లవ ఉద్యమం, అలహాబాద్ హైకోర్టు తీర్పు, రాజకీయ వ్యతిరేకత నేపథ్యంలో ఇది జరిగింది. ప్రెస్ సెన్సార్‌షిప్, వ్యతిరేక నాయకుల అరెస్టులు, బలవంతపు కుటుంబ నియంత్రణ చర్యలు వంటి చర్యలు అమలయ్యాయి. ప్రజా నిరసనలు అణచివేయబడ్డాయి. ఎమర్జెన్సీని ఆమె స్వయంగా 1977 మార్చిలో ఉపసంహరించుకుని ఎన్నికలు ప్రకటించారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా ఓడిపోయింది. జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పడింది. ఇది స్వతంత్ర భారతంలో మొదటిసారి కేంద్రంలో కాంగ్రెస్ యేతర ప్రభుత్వం. ఎమర్జెన్సీ కాలంలో జరిగిన అధికార దుర్వినియోగం, ప్రజా స్వేచ్ఛల అణచివేతపై ప్రజల్లో పెరిగిన ఆగ్రహం ఈ ఓటమికి ముఖ్య కారణంగా నిలిచింది.

**ప్రజా ఉద్యమాలకు తలొగ్గాల్సిందే..**

ప్రజా ఉద్యమాలకు ఎంత బలమైన ప్రభుత్వమైనా, నాయకుడైనా తలొగ్గాల్సిందే. సుదీర్ఘ వీధి నిరసనలు, రైతు–విద్యార్థి ఉద్యమాల ఒత్తిడికి విధానాలను ఉపసంహరించుకోవడం. అధికారాన్ని ఉపయోగించి ఉద్యమాలను అణచివేసిన తర్వాత ఎన్నికల్లో ప్రజా తీర్పు ఎదుర్కోవడం ఇందుకు నిదర్శనం. ఇదే సమయంలో ప్రజా ఉద్యమాలు విజయం సాధించాలంటే స్థాయి, కాలం, సమన్వయం, ఎన్నికల సమయం ముఖ్యం. అదే సమయంలో ప్రభుత్వాలు సంస్కరణలు తీసుకురావాలనుకున్నప్పుడు విస్తృత సంప్రదింపులు, సమ్మతి లేకపోతే ఇలాంటి పరిణామాలు తప్పవు.

స్వతంత్ర భారతంలో ప్రజల గొంతు ఎప్పుడూ పూర్తిగా అణగదొక్కబడలేదు. కొన్ని సార్లు విధాన మార్పుల ద్వారా, కొన్ని సార్లు ఎన్నికల ద్వారా అది వ్యక్తమైంది. ఇది ప్రజాస్వామ్య బలానికి నిదర్శనం.

# వేడి నీరు.. చల్లటి నీరు.. ఏ స్నానం మంచిది..

ప్రతిరోజూ స్నానం చేయడం వల్ల కేవలం శరీరాన్ని శుభ్రంగా ఉంచుకోవడం మాత్రమే కాదు.. మానసికంగా కూడా ఉల్లాసంగా ఉంటుంది. అయితే వేడినీటితో స్నానం చేయడం మంచిదా? చన్నీటి స్నానం బెటరా? అని చాలా మందికి సందేహం ఉంటుంది. అందరికీ ఒకే రకమైన నీరు సరిపోదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వాతావరణం, ఆరోగ్య పరిస్థితులను బట్టి ఏ రకమైన నీటితో స్నానం చేయాలి? అనేది నిర్ణయించుకోవాలి. ఎవరికి ఏ నీరు మంచిదో ఇప్పుడు చూద్దాం..

దాదాపు చాలా మంది చల్లటి నీటితో స్నానం చేస్తుంటారు. ఎందుకంటే వేడి నీరు ప్రతీ చోటా అందుబాటులో ఉండకపోవచ్చు. చన్నీటి స్నానం చేయడం వల్ల శరీరం చురుకుదనాన్ని పొందుతుంది. ముఖ్యంగా ఉదయం నిద్ర లేచిన తర్వాత చల్లటి నీరు శరీరంపై పడినప్పుడు రక్తనాళాలు తాత్కాలికంగా కుంచించుపోతాయి.ఈ క్రమంలో మనసు కూడా ఉత్తేజంగా మారుతుంది. తీవ్రమైన వ్యాయామం లేదా క్రీడల తర్వాత చన్నీటి స్నానం ఉపయోగం అని అంటున్నారు. ఈ స్నానం వల్ల కండరాల నొప్పి, వాపు వంటి లక్షణాలు కొంతవరకు తగ్గే అవకాశం ఉందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

గోరువెచ్చని నీటితో స్నానం చేయడం వల్ల కండరాలు సడలిపోతాయి. దీంతో శరీరానికి రిలాక్సేషన్ లభిస్తుంది. రోజంతా పని చేసి అలసిపోయిన వారికి, ఎక్కువసేపు నిలబడి పనిచేసే వారికి లేదా శారీరక శ్రమ చేసిన వారికి వేడి నీటి స్నానమే బెటర్ అని అంటున్నారు. రాత్రి పడుకునే ముందు గోరువెచ్చని నీటితో స్నానం చేయడం వల్ల మంచి నిద్ర వస్తుంది. చలికాలంలో గోరువెచ్చని నీటితో స్నానం చేయడం సౌకర్యంగా ఉంటుంది. అయితే నీరు మరీ వేడిగా ఉండకూడదు. అధిక వేడి నీటితో స్నానం చేయడం వల్ల చర్మంలోని సహజ నూనెలు తొలగిపోయి చర్మం పొడిబారడం, దురద, మంట వంటి సమస్యలు తలెత్తవచ్చు.



గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు, అధిక లేదా తక్కువ రక్తపోటు ఉన్నవారు, వృద్ధులు చాలా వేడి లేదా చాలా చల్లటి నీటితో స్నానం చేయడంలో జాగ్రత్తగా ఉండాలి. ఒక్కసారిగా తీవ్రమైన చలి లేదా వేడి శరీరంపై ప్రభావం చూపవచ్చు. ముఖ్యంగా గుండె జబ్బులు ఉన్నవారు తమ ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా స్నానం చేసే నీటి ఉష్ణోగ్రత గురించి వైద్యుల సలహా తీసుకోవడం మంచిది.

## వానాకాలం
# తస్మాత్ జాగ్రత్త..

వానలు కురుస్తున్నాయి. దీంతో వాతావరణం చల్లగా మారింది.. చల్లటి వాతావరణంలో అనేక జంతువులు బయటికి వస్తాయి. అందులో సరిసృపాల జాతికి చెందిన పాములు ముఖ్యమైనవి.. వర్షాకాలంలో ఇవి మొక్కల కింద లేదా చెట్ల కింద తల దాచుకుంటాయి. ఆదమర్చి వీటిపై కాలు లేదా చేయి వేస్తే అంతే సంగతులు. అలాంటి ప్రమాదం రాకముందే జాగ్రత్తపడాలి.



**గడ్డి పెరగకుండా చూడాలి**

ఇంటి పరిసరాల్లో వర్షాకాలం గడ్డి విస్తారంగా పెరుగుతుంది. ఈ గడ్డి కింద పాములు, ఇతర విష జంతువులు తల దాచుకుంటాయి. అలాంటప్పుడు గడ్డి పెరగకుండా చూసుకోవాలి. సాధ్యమైనంతవరకు మూడు రోజులకు ఒకసారి కట్ చేసుకోవాలి. అప్పుడే అది పాములకు ఆవాసంగా మారదు.

**విస్తారంగా పెరిగే మొక్కలు**

వీటిని బొటానికల్ పరిభాషలో గ్రౌండ్ కవర్ ప్లాంట్స్ అంటారు. ఈ మొక్కల ఆకులు చాలా పెద్దవిగా ఉంటాయి. కాండం చాలా చిన్నగా ఉండడంతో విష సర్పాలు తల దాచుకునేందుకు అవకాశం ఉంటుంది. అలాంటప్పుడు ఈ మొక్కలను ఎప్పటికప్పుడు విస్తారంగా పెరగకుండా కట్ చేయడమే మంచిది.

**పండ్ల పొదలు**

వానా కాలంలో తీగ జాతికి చెందిన మొక్కలు పండ్లను కాస్తాయి.. ఈ పండ్ల కోసం కీటకాలు, ఇతర పురుగులు వస్తాయి. వీటిని ఆహారంగా తీసుకునేందుకు తొండలు, ఇతర బల్లుల వంటివి వస్తాయి. వాటిని తినేందుకు పాములు ఆ పరిసర ప్రాంతాల్లో తిష్ఠ వేసుకుని ఉంటాయి. ఇలాంటప్పుడు అలాంటి పొదల్లో పండ్లను త్వరగా కోసుకుని, ఎప్పటికప్పుడు ఆకులను శుభ్రం చేసుకోవడమే మంచిది.

**పుష్పించే మొక్కలు**

వానా కాలంలో చాలావరకు మొక్కలు పుష్పిస్తాయి. ఈ పుష్పాల్లో ఉన్న మకరందం కోసం ఇతర కీటక జాతికి చెందిన జీవులు వస్తుంటాయి. వాటిని ఆహారంగా తీసుకునేందుకు ఎలుకలు, ఇతర జంతువులు ఆ ప్రాంతంలో తిరగాడుతూ ఉంటాయి. వాటిని తినేందుకు సర్పాలు, ఇతర విష జంతువులు తిరుగుతుంటాయి. అలాంటప్పుడు పూల మొక్కలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవడం మంచిది.

**రాక్ గార్డెన్స్**

చాలామంది ఇళ్లల్లో రాక్ గార్డెన్స్ పేరుతో పుష్పించే మొక్కలను పెంచుకుంటుంటారు. ఇవి చూసేందుకు చాలా ఆకర్షణంగా కనిపిస్తాయి. అందంగా కూడా ఉంటాయి. అయితే ఈ మొక్కల ఆకులు, పుష్పాలు దళసరిగా ఉంటాయి కాబట్టి.. ఇవి సర్పాలు, ఇతర జంతువులకు ఆశ్రయంగా మారుతాయి. అలాంటప్పుడు ఇలాంటి మొక్కలను ఎప్పటికప్పుడు కట్ చేసుకోవడం లేదా పుష్పాలను కోయడం వంటి పనులు చేపట్టాలి. అప్పుడే విష సర్పాలు రాక్ గార్డెన్ కిందకు రాకుండా అడ్డుకునేందుకు ఆస్కారం ఉంటుంది.

# ఆషాఢంలో నియమాలు?

హిందూ సంప్రదాయంలో ఆషాఢ మాసంను అత్యంత పవిత్రమైన మాసంగా భావిస్తారు. ఈ నెలలో శ్రీమహావిష్ణువు యోగనిద్రలోకి ప్రవేశిస్తారని, దేవతల శక్తులు అంతర్ముఖమవుతాయని పురాణాలు చెబుతున్నాయి. చాతుర్మాస్య దీక్షలు కూడా ఈ మాసంతోనే ప్రారంభమవుతాయి. అందుకే ఆషాఢంలో ఆధ్యాత్మిక సాధన, ఉపవాసాలు, దానధర్మాలు, దేవారాధనకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. అయితే ఈ మాసంలో కొన్ని నియమాల కూడా పాటించాలని చెబుతున్నారు. అవేంటంటే?



ఆషాఢ శుద్ధ ఏకాదశిని దేవశయని ఏకాదశిగా జరుపుకుంటారు. ఈ రోజున శ్రీమహావిష్ణువు క్షీరసాగరంలో యోగనిద్రలోకి వెళ్తాడని విశ్వాసం. ఆ తర్వాత వచ్చే నాలుగు నెలలను చాతుర్మాసం అంటారు. ఈ కాలంలో వివాహాలు, గృహప్రవేశాలు వంటి శుభకార్యాలను సాధారణంగా నిర్వహించరు. అయితే దేవుని ఆరాధన, జపం, ధ్యానం, పూజలకు ఇది అత్యంత అనుకూల సమయంగా భావిస్తారు.

ఆషాఢ మాసంలో ప్రతిరోజూ బ్రహ్మముహూర్తంలో నిద్రలేచి స్నానం చేసి దేవుని ప్రార్థించడం మంచిదని శాస్త్రాలు సూచిస్తున్నాయి. సాత్విక ఆహారం తీసుకోవడం, మద్యపానం, మాంసాహారం, అసత్యం, కోపం వంటి వాటికి దూరంగా ఉండడం శ్రేయస్కరం. పెద్దలను గౌరవించడం, నిత్యం విష్ణు సహస్రనామం, లలితా సహస్రనామం లేదా శివ నామస్మరణ చేయడం ద్వారా ఆధ్యాత్మిక ప్రశాంతత లభిస్తుందని విశ్వసిస్తారు.

ఆషాఢంలో ముఖ్యంగా శ్రీమహావిష్ణువు, లక్ష్మీదేవి, శివుడు, పార్వతీదేవి ఆరాధనకు విశేష ఫలితం ఉంటుందని చెబుతారు. ప్రతి గురువారం లక్ష్మీనారాయణ స్వామిని పూజించడం, శుక్రవారం అమ్మవారికి కుంకుమార్చన చేయడం, సోమవారం శివాభిషేకం నిర్వహించడం శుభప్రదంగా భావిస్తారు. అలాగే తులసి మొక్కకు ప్రతిరోజూ దీపం వెలిగించి ప్రార్థించడం కూడా మంచి ఫలితాలను ఇస్తుందని నమ్మకం.

ఆషాఢ శుద్ధ ఏకాదశి రోజున ఉపవాసం ఉండి శ్రీమహావిష్ణువును భక్తిశ్రద్ధలతో పూజిస్తే పాపాలు తొలగి ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలుగుతాయని పురాణాల్లో పేర్కొన్నారు. ఈ రోజున విష్ణు సహస్రనామ పారాయణం, 'ఓం నమో నారాయణాయ' మంత్ర జపం చేయడం పుణ్యప్రదంగా భావిస్తారు.

తెలుగు రాష్ట్రాల్లో ఆషాఢ మాసంలో అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, బోనాల ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. దుర్గాదేవి, మహంకాళి, ఎల్లమ్మ వంటి గ్రామదేవతలను భక్తిశ్రద్ధలతో పూజించడం ఆనవాయితీ. స్త్రీలు కుంకుమార్చన చేసి ఆరోగ్యం, ఐశ్వర్యం కోసం ప్రార్థిస్తారు.

ఈ మాసంలో అన్నదానం, వస్త్రదానం, గొడుగులు, చెప్పులు, తాగునీరు, పండ్లు వంటి వాటిని అవసరమైన వారికి దానం చేయడం అత్యంత పుణ్యకార్యంగా భావిస్తారు. గోవులకు పచ్చిగడ్డి, పక్షులకు గింజలు, నీరు అందించడం కూడా శుభఫలితాలను ఇస్తుందని విశ్వాసం.

ప్రతి సాయంత్రం తులసి కోట వద్ద నెయ్యి లేదా నువ్వుల నూనెతో దీపం వెలిగించి తులసి చుట్టూ ప్రదక్షిణలు చేయడం శుభప్రదం. తులసి పూజ వల్ల కుటుంబంలో శాంతి, ఐశ్వర్యం, సానుకూల వాతావరణం నెలకొంటుందని పురాణాలు చెబుతున్నాయి. ఈ మాసంలోని ప్రతి సోమవారం శివలింగానికి పాలు, నీరు, బిల్వదళాలతో అభిషేకం చేసి 'ఓం నమః శివాయ' మంత్రాన్ని జపిస్తే మానసిక ప్రశాంతత, ఆరోగ్యం, కుటుంబ సౌఖ్యం కలుగుతాయని భక్తుల విశ్వాసం.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 27.07.2026
www.mudranews.in | @mudranews



## నిద్రలేమి సంకేతాలు :

పగటిపూట నిద్రమత్తు, ఆవలింతలు ఎక్కువసార్లు రావడం, సమావేశాల్లో లేదా ప్రయాణ సమయం లో నిద్ర మత్తు వేధించడం శరీరానికి సరైన విశ్రాంతి దక్కలేదని సూచిస్తుంది.



# కార్గిల్ వీర జవాన్లకు నివాళి






**ముద్ర, హైదరాబాద్:** కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా భారత మాత కోసం తమ ప్రాణాలను అర్పించిన అమర వీర జవాన్లకు మాజీ గవర్నర్ శ్రీ బండారు దత్తాత్రేయ ఘనంగా నివాళులర్పించారు. దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన సైనికుల సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.1999లో పాకిస్తాన్ చొరబాటుదారులు కార్గిల్ ప్రాంతంలోని భారత భూభాగంలో అక్రమంగా చొరబడి ఆక్రమణకు యత్నించిన సమయంలో, అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి నాయకత్వంలో భారత సైన్యం, ముఖ్యంగా భారత వాయుసేన చేపట్టిన 'ఆపరేషన్ విజయ్' విజయవంతమై శత్రువులను తరిమికొట్టి కార్గిల్ శిఖరాలపై తిరిగి భారత త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించిందని ఆయన గుర్తు చేశారు.అత్యంత క్లిష్టమైన వాతావరణ పరిస్థితులు, ఎత్తైన పర్వత శిఖరాలు, ప్రాణాలను సైతం లెక్కచేయని ధైర్యసాహసాలతో మన వీర జవాన్లు సాధించిన ఈ విజయం భారత సైనిక చరిత్రలో స్వర్ణాక్షరాలతో నిలిచిపోయిందన్నారు. దేశ సమగ్రత, సార్వభౌమాధికారాన్ని కాపాడటంలో భారత సైన్యం చూపిన పరాక్రమం ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.సరిహద్దుల్లో నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను అర్పిస్తున్న సైనికులకు, వారి కుటుంబాలకు దేశ ప్రజలందరూ అండగా నిలవాలని దత్తాత్రేయ పిలుపునిచ్చారు. వారి త్యాగాలను ప్రతి భారతీయుడు ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని, దేశ భద్రత కేవలం సైన్యానిదే కాకుండా ప్రతి పౌరుడి బాధ్యత కూడా అని అన్నారు.కులం, మతం, భాష, ప్రాంతం అనే భేదాలకు అతీతంగా "భారతదేశం నా మాతృభూమి – దాని రక్షణ నా బాధ్యత" అనే భావన ప్రతి భారతీయుడిలో బలపడాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాశం సాయి కృష్ణ యాదవ్, ఆర్. శేషసాయి, వంశీకృష్ణ నాయకత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో సి. మోహన్, కౌడిన్య ప్రసాద్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలలో..

**ముద్ర ప్రతినిధి, తాండూర్:** కార్గిల్ యుద్ధంలో దేశ రక్షణ కోసం ప్రాణాలను అర్పించిన అమర జవాన్ల త్యాగాలను స్మరించుకుంటూ తాండూరు పట్టణంలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాలలో ఆదివారం కార్గిల్ విజయ్ దివస్ వేడుకలను పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో అమర జ్యోతిని వెలిగించి కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన భారత సైనికులకు ఘన నివాళులు అర్పించారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి, సైనికుల త్యాగాలను స్మరించుకుంటూ సెల్యూట్ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు దేశభక్తి గీతాలు ఆలపించి, దేశ రక్షణలో సైనికుల సేవలను కొనియాడారు. పాఠశాల ఆవరణ దేశభక్తి నినాదాలతో మార్మోగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తాండూర్ డి.ఎస్.పి నర్సింగ్ యాదయ్య మాట్లాడుతూ, జమ్మూ–కాశ్మీర్ సరిహద్దుల్లో మైనస్ 40 డిగ్రీల తీవ్ర చలిలోనూ భారత సైనికులు దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందిస్తున్నారని అన్నారు. అలాంటి అమరవీరులను స్మరించుకుంటూ ప్రతి ఏడాది ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.విద్యార్థులు కేవలం విద్యలోనే కాకుండా దేశభక్తి క్రమశిక్షణ దైవభక్తి వంటి విలువలను కూడా అలవర్చుకోవాలని సూచించారు. అలాగే వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి మాధవరెడ్డి మాట్లాడుతూ 1999 కార్గిల్ యుద్ధంలో 527 మంది భారత జవాన్లు దేశం కోసం ప్రాణత్యాగం చేశారని ఆయన గుర్తు చేశారు వారి త్యాగాలను ప్రతి భారతీయుడుఎప్పటికీ గుర్తుంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మరియు అధ్యాపక బృందం విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సొమ్ము దారి మళ్లిస్తే ఊరుకోం

**ముద్ర, హైదరాబాద్:** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో ఉన్న కోట్లాది రూపాయలను ప్రభుత్వం దారి మళ్లిస్తోందని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకుడు డి. వీరన్న ఆరోపించారు. కార్మికుల సంక్షేమ నిధులను ఇతర అవసరాలకు మళ్లించే ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తెలంగాణ రక్షణ సేన అనుబంధంగా తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం ఆవిర్భావ సదస్సు ఆదివారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన డి. వీరన్న, కాంగ్రెస్ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. కార్మికుల హక్కులను కాపాడేందుకు అవసరమైతే ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన రాష్ట్ర కమిటీని ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎత్తరి గణేష్ ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, 18 మంది సభ్యులతో రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేశారు.నూతన అధ్యక్షుడు ఎత్తరి గణేష్ మాట్లాడుతూ, తెలంగాణలో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు భవన నిర్మాణ కార్మిక సంఘాన్ని బలోపేతం చేస్తామని తెలిపారు. కార్మికులకు ఎలాంటి సమస్య వచ్చినా తెలంగాణ రక్షణ సేన అండగా ఉంటుందని, వారికి రావాల్సిన ప్రతి హక్కు, ప్రతి రూపాయి అందే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన నాయకులు వరికుప్పల గంగాధర్, వెంకట్రావు, సుందర్‌రావు, చలపతిరావు, రమణయ్య, తిరుపతి, శ్రీనివాస్, రాజు, శ్రీకృష్ణ, సురేష్, నవీన్‌తో పాటు భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక తవ్వకాలపై ఆరోపణలు



**ముద్ర ప్రతినిధి, తాండూర్:** వికారాబాద్ జిల్లా యాలాల మండలం విశ్వనాథ్‌పూర్ వాగులో అక్రమంగా ఇసుక తవ్వకాలు, తరలింపు జరుగుతోందని గ్రామస్థులు ఆరోపించారు. ఈ వ్యవహారంలో కొందరు ప్రజాప్రతినిధుల అనుచరవర్గం ప్రమేయం ఉందని పేర్కొంటూ, జిల్లా యంత్రాంగం వెంటనే సమగ్ర విచారణ చేపట్టి నిజానిజాలు వెలికితీయాలని డిమాండ్ చేశారు.ఇసుక టిప్పర్లను బీఆర్‌ఎస్ యాలాల మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి అడ్డుకున్నట్లు తెలిపారు. కాగా, ఈ ఆరోపణలపై ఎమ్మెల్యే బయ్యాని మనోహర్ రెడ్డి, సంబంధిత అధికారులు ఇప్పటివరకు స్పందించలేదు.

# హాస్టల్ విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం




**ముద్ర ప్రతినిధి, తాండూర్:** విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా బీసీ సంఘం, తాండూర్ ఆధ్వర్యంలో హాస్టల్ విద్యార్థుల కోసం ఉచిత వైద్య శిబిరం మూడవ విడత విజయవంతంగా నిర్వహించబడిది . ఐఎంఏ తాండూర్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో నిపుణులైన వైద్యులు విద్యార్థులకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సలహాలతో పాటు ఉచితంగా మందులు అందజేశారు.ఈ సందర్భంగా బీసీ సంఘం కన్వీనర్ రాజ్ కుమార్ కందుకూరి మాట్లాడుతూ, "ఉద్యమమే కాదు... సామాజిక సేవ కూడా మా బాధ్యత. సమాజ అభివృద్ధికి విద్య ఎంత ముఖ్యమో, విద్యార్థుల ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం. ఆరోగ్యవంతమైన విద్యార్థులే రేపటి బలమైన సమాజాన్ని నిర్మిస్తారు. అందుకే బీసీ సంఘం సామాజిక బాధ్యతగా హాస్టల్ విద్యార్థుల కోసం ఉచిత వైద్య శిబిరాలను నిరంతరం నిర్వహిస్తోంది" అని తెలిపారు. ఐఎంఏ తాండూర్ అధ్యక్షులు డా. జయప్రసాద్ మాట్లాడుతూ, "ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్యలోనూ, జీవితంలోనూ ఉత్తమ ఫలితాలు సాధించగలరు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ, సమతుల్య ఆహారం తీసుకుంటూ, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. చిన్న ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించడం అలవాటు చేసుకోవాలి" అని సూచించారు.ఈ కార్యక్రమంలో ఐఎంఏ తాండూర్ అధ్యక్షులు డా. జయప్రసాద్, డా. శివమోహన్ రెడ్డి, డా. మల్లికార్జున్, డా. జగదీప్ రెడ్డి, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు సయ్యద్ షకుర్, హాస్టల్ వార్డెన్ భాగ్యలక్ష్మి , బీసీ మహిళా సంఘం నాయకులు అనిత, మంజుల, విజయలక్ష్మి , మంబాపూర్ మంజుల, మండల అధ్యక్షులు లక్ష్మణ చారి, బసంత్ కుమార్, మీడియా ఇంచార్జ్ బసవరాజ్, బిసి యువ నాయకులు రాము ముదిరాజ్, పరమేష్, హరి ప్రసాద్, పాండు గౌడ్, దుబాయ్ వెంకట్, తాండ్ర నరేష్, యాసర్, వినయ్, కిరణ్, ఉద్యమాగాయకుడు, బాలు, శివాజీ, హాస్టల్ విద్యార్థులు, సిబ్బంది, బీసీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శాకంబరీ దేవిగా మాతా నిమిషాంబిక దివ్య దర్శనం



**బోడుప్పల్, ముద్ర:** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ పెంటారెడ్డి కాలనీలో వేంచేసివున్న శ్రీ మాతా నిమిషాంబికా దేవి ఆదివారం భక్తులకు అద్వితీయమైన దర్శనం కల్పించారు. ఆషాడ ఆదివారం సందర్భంగా అమ్మవారు శాకంబరీ దేవిగా అత్యంత వైభవోపేతంగా అలంకరించుకుని భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆషాఢ మాసంలో జగన్మాతను వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, ధాన్యాలు, పండ్లతో అలంకరించి శాకాంబరీ దేవిగా పూజించడం సనాతన సంప్రదాయంలో విశిష్టమైన ఆచారం. "శాకం" అంటే కూరగాయలు. సమస్త జీవ రాశులకు ఆహారాన్ని ప్రసాదించే అన్నపూర్ణ స్వరూపిణిగా, ప్రకృతికి పోషక శక్తిగా అమ్మవారిని శాకాంబరీ దేవిగా కొలవడం ఆనవాయితీ. ఈ పవిత్ర అలంకరణను దర్శించి పూజిస్తే ప్రకృతి వైపరీత్యాలు తొలగి, సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలు పుష్కలంగా పండుతాయని, భూమాత సస్యశ్యామలంగా విరాజిల్లుతుందని, సమస్త జీవరాశులకు ఆహార లోటు ఉండదని భక్తుల విశ్వాసం. ఈ సందర్భంగా ఆలయంలోని ప్రధాన దేవాలయంతో పాటు ఉపాలయాలలో మూర్తులను కూడా వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో రూపొందించిన తోరణాలు, అలంకరణలతో సుందరంగా తీర్చిదిద్దారు. అమ్మవారి దివ్య శాకంబరీ అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఉదయం నుంచే అశేష భక్తజనులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని, ఒడిబియ్యం, సారె సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. భక్తులందరికీ అమ్మవారి దివ్య దర్శనం కల్పించేందుకు ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేసి, త్రాగునీరు, క్యూలైన్లు, ప్రసాద వితరణ, ఇతర సౌకర్యాలను సమకూర్చారు. శాకంబరి దేవిగా అమ్మవారి దివ్య మంగళ స్వరూపాన్ని కనులారా వీక్షించిన భక్తులు ఆ తల్లి అనుగ్రహంతో సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలు పుష్కలంగా పండి, ప్రపంచమంతా సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని మనసారా ప్రార్థించారు.ఆలయ చైర్మన్ కామరౌతు వినోద్ కుమార్, సెట్లర్ కళావతి, ప్రధాన కార్యదర్శులు కె.అశోక్ కుమార్, సంగు శ్రీనివాస్, కోశాధికారి ఎన్.రమేష్ , రాష్ట్ర నకాష్ సంఘం ప్రధాన కార్యదర్శి కొరిచెర్ల శ్రీనివాస్ రావు తదితరులు ఆలయంలో వుండి స్వయంగా భక్తులకు సదుపాయాలను కల్పించారు. ఆలయ ట్రస్ట్ ధర్మకర్తలు బి. హిమచందర్, వై. చంద్రశేఖర్, ఎస్. గౌరి శంకర్, డి. నర్సింగ్ రావు, ఎమ్. శ్రీనివాస్ రావు, ఎమ్. సాయి బాబా (శ్యామ్), డి. సతీష్, రామగిరి శ్రీకాంత్, ఎన్. శ్రీకాంత్, ఎన్ . రామకృష్ణ, ఎన్. మోహన్, డి. రామక్రిష్ణ, ఎన్. శ్రీధర్, వెంకట్ రాజారావు, కె. ప్రవీణ్ కుమార్, డి. నరేష్, వై. సత్యనారాయణలు భక్తులకు మంచిగా దర్శనం కల్పించడంలో సహకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ శర్మ, అర్చకుడు ఉమకాంత్ శర్మలు తమ సహ అర్చకులతో కలిసి అమ్మవారి దివ్య అలంకరణ చేయడంతో పాటు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు.

## వరద నీటి కాల్వ, సీసీ రోడ్డు పనుల పరిశీలన

### పనులు వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం
### పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**ముద్ర, హైదరాబాద్ / శేరిలింగంపల్లి:** హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని వైశాలి నగర్ కాలనీలో రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రూ.70 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన వరద నీటి కాల్వ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకుడు బాలింగ్ గౌతమ్ గౌడ్, సీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు ఆయన వెంట ఉన్నారు.ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ.. మంజీరా పైప్‌లైన్ రోడ్డు నుంచి మసీదుబండకు వెళ్లే మార్గంలోని రైల్వే అండర్‌పాస్ వద్ద నిత్యం తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోందని చెప్పారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రూ.70 లక్షల వ్యయంతో వరద నీటి కాల్వతో పాటు సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామని పేర్కొన్నారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా పక్కా ప్రణాళికలతో పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. వరద నీటి కాల్వ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఎలాంటి రాజీ పడకూడదని ఆదేశించారు.శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తామని, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని గాంధీ తెలిపారు. హఫీజ్‌పేట్ డివిజన్‌తో పాటు మొత్తం శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమంలో సీఎంసీ ఇంజినీరింగ్ విభాగం డీఈ ఆనంద్, ఏఈ భాస్కర్, నాయకులు వెంకటేశ్వర్లు, క్రిషాంక్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ బృందావనం ప్రాజెక్టుకు 'బెస్ట్ కమ్యూనిటీ బిల్డర్ అవార్డు'



**ముద్ర, హైదరాబాద్:** నోవోటెల్ హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన గ్లోబల్ సీ–సూట్ కమ్యూనిటీ ప్లాట్‌ఫామ్ – గ్రోత్ స్టోరీస్ కార్యక్రమంలో కాకతీయ బృందావనం ప్రాజెక్టుకు 'బెస్ట్ కమ్యూనిటీ బిల్డర్ అవార్డు' లభించింది. ఈ అవార్డును ప్రాజెక్టు ఎండీ బ్రహ్మజీ అందుకున్నారు.ఈ సందర్భంగా బ్రహ్మజీ మాట్లాడుతూ, ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు అందుకోవడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందన్నారు. ఈ గుర్తింపును అందించిన గ్లోబల్ సీ–సూట్ కమ్యూనిటీ ప్లాట్‌ఫామ్ నిర్వాహకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ అవార్డు తన ఒక్కరిదే కాదని, కాకతీయ బృందావనం ప్రాజెక్టు విజయానికి తోడ్పడిన ప్రతి సభ్యుడు, కుటుంబ సభ్యులు, మిత్రులు, సహచరులు, శ్రేయోభిలాషులందరికీ ఈ గౌరవాన్ని అంకితం చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ గుర్తింపు తమపై మరింత బాధ్యతను పెంచిందని, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపడుతూ విలువైన కమ్యూనిటీల నిర్మాణంలో సేవలను కొనసాగిస్తామని బ్రహ్మజీ తెలిపారు.ప్రజల ప్రేమ, ప్రోత్సాహం, ఆశీస్సులు ఎల్లప్పుడూ తమకు ఇలాగే కొనసాగాలని ఆకాంక్షిస్తూ అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## వైభవంగా ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవ బోనాలు



**ముద్ర కూకట్‌పల్లి :** ఆషాఢ మాస బోనాల సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ కైత్లాపూర్ ఎల్లమ్మ తల్లి అమ్మవారి 6వ కళ్యాణ మహోత్సవం, శ్రీ పెద్దమ్మ తల్లి బోనాల మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు.ఆలయ వ్యవస్థాపకులు సంతోష్ కుమార్ ఆహ్వానం మేరకు రాష్ట్ర సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఈ పవిత్ర కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి అమ్మవారి కృపాకటాక్షాలు పొందారు.అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆలయ నిర్వాహకులను అభినందిస్తూ, ఆషాఢ మాస బోనాలు మన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావును ఘనంగా సన్మానించారు.ఈ వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## క్యాంపస్ అనుభవాలే జీవిత పాఠాలు బోధిస్తాయి

### బిగ్‌బాస్కెట్ సహ వ్యవస్థాపకుడు హరి మీనన్

**ముద్ర, హైదరాబాద్:** పాఠ్యాంశాల ద్వారా విద్యను పొందవచ్చుగానీ, జీవితానికి అవసరమైన నిజమైన పాఠాలను క్యాంపస్‌లోని అనుభవాలే నేర్పుతాయని బిగ్‌బాస్కెట్ సహ వ్యవస్థాపకుడు హరి మీనన్ అన్నారు. బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్‌లో నిర్వహించిన పట్టభద్రుల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన పట్టభద్రులను ఉద్దేశించి ప్రేరణాత్మక ప్రసంగం చేశారు.ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించే సమయంలో అధిక వేతనాలు, ఉన్నత హోదాల కంటే కొత్త విషయాలను నేర్చుకోవడానికే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. స్వల్పకాలిక లాభాల కోసం కాకుండా, దీర్ఘకాలిక లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.జీవిత ప్రయాణంలో తమ ఎదుగుదలకు తోడ్పడిన తల్లిదండ్రులు, అధ్యాపకుల పట్ల ఎల్లప్పుడూ కృతజ్ఞతాభావంతో ఉండాలని విద్యార్థులకు సూచించారు. కార్పొరేట్ ప్రపంచంలో విజయానికి అనుభవం, సరైన నిర్ణయాలు తీసుకునే విచక్షణ ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు."డిగ్రీ అనేది విజయానికి తొలి మెట్టు మాత్రమే. క్యాంపస్‌లో పొందిన అనుభవాలే మీ భవిష్యత్తును తీర్చిదిద్దుతాయి. నేర్చుకోవడం ఎప్పుడూ ఆపొద్దు. కొత్త అవకాశాలను సవాళ్లుగా స్వీకరించి ముందుకు సాగండి" అని హరి మీనన్ పట్టభద్రులకు సూచించారు.

## నిద్రలేమి సంకేతాలు :

తరచూ తలనొప్పి, శారీరక అసౌకర్యం..ఉదయం లేవగానే తలనొప్పి రావడం లేదా రోజంతా తల బరువుగా అనిపించడం నిద్రలేమి వల్ల కలిగే సాధారణ లక్షణం. కళ్లలో మంట, శరీర నొప్పులు కూడా కనిపించవచ్చు.



## శాకంబరీ దేవిగా దర్శనం



ముద్ర కరీంగన్: కరీంనగర్లోని ప్రఖ్యాత అమ్మవారు శ్రీ మాతా నిమిషాంబికా దేవి ఆదివారం భక్తులకు అద్వితీయమైన దర్శనం కల్పించారు. ఆషాడ ఆదివారం సందర్భంగా అమ్మవారు శాకంబరీ దేవిగా అత్యంత వైభవోపేతంగా అలంకరించుకుని భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆషాఢ మాసంలో జగన్మాతను వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, ధాన్యాలు, పండ్లతో అలంకరించి శాకాంబరీ దేవిగా పూజించడం సనాతన సంప్రదాయంలో విశిష్టమైన ఆచారం. "శాకం" అంటే కూరగాయలు. సమస్త జీవరాశులకు ఆహారాన్ని ప్రసాదించే అన్నపూర్ణ స్వరూపిణిగా, ప్రకృతికి పోషకశక్తిగా అమ్మవారిని శాకాంబరీ దేవిగా కొలవడం ఆనవాయితీ.

ఈ పవిత్ర అలంకరణను దర్శించి పూజిస్తే ప్రకృతి వైపరీత్యాలు తొలగి, సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలు పుష్కలంగా పండుతాయని, భూమాత సస్యశ్యామలంగా విరాజిల్లుతుందని, సమస్త జీవరాశులకు ఆహార లోటు ఉండదని భక్తుల విశ్వాసం. ఈ సందర్భంగా ఆలయంలోని ప్రధాన దేవాలయంతో పాటు ఉపాలయాలలో మూర్తులను కూడా వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో రూపొందించిన తోరణాలు, అలంకరణలతో సుందరంగా తీర్చిదిద్దారు. అమ్మవారి దివ్య శాకంబరీ అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఉదయం నుంచే అశేష భక్తజనులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని, ఒడిబియ్యం, సారె సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. భక్తులందరికీ అమ్మవారి దివ్య దర్శనం కల్పించేందుకు ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేసి, త్రాగునీరు, క్యూలైన్లు, ప్రసాద వితరణ, ఇతర సౌకర్యాలను సమకూర్చారు. శాకంబరి దేవిగా అమ్మవారి దివ్య మంగళ స్వరూపాన్ని కనులారా వీక్షించిన భక్తులు ఆ తల్లి అనుగ్రహంతో సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడిపంటలు పుష్కలంగా పండి, ప్రపంచమంతా సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని మనసారా ప్రార్థించారు.

## సహకార భారతి కార్యవర్గ ఎన్నికలు



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** లోకమాన్య పరస్పర సహాయక పొదుపు మరియు పరపతి సహకార సంఘం మూడవ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఎన్నికల అధికారి కందూరి శంకర్ 2026–27 సంవత్సరానికి నూతన పాలకవర్గ సభ్యులకు ఎన్నికలు నిర్వహించారు. నూతన డైరెక్టర్లుగా చిప్ప ప్రమోద్, శేరే వ్యాస్, మూర్తి అనిత, కుంట అన్నపూర్ణ, దేశ్కర్ భీమ్ రావు లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. చైర్మన్ గా భూసారపు గంగాధర్ నాలుగో సారి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. కార్యదర్శిగా మహాజన్ సతీష్, కోశాధికారి గా అన్నం వాసుదేవరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా మైసర్ల వెంకటరమణ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ముత్యం రెడ్డి, సహకార భారతి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు యెక్కటి ఉపేందర్ రెడ్డి, అతిథులుగా ముక్క సాయి ప్రసాద్, సహకార భారతి తెలంగాణ ఆంధ్ర రాష్ట్రాల సంఘటన ప్రముఖ్ పొన్నాల యాదగిరి, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నిర్మల్ జిల్లా సంఘచాలక్ నూకల విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## కమిషనర్ ను అవమానించడం సరికాదు

**కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గణేష్**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ మున్సిపల్ కమిషనర్ ను అవమానపరిచిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తన తీరును మార్చుకోవాలని టిపిసిసి ఎస్సీ సెల్ డిపార్ట్మెంట్ రాష్ట్ర కార్యదర్శి కొంతం గణేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ మున్సిపల్ కమిషనర్ దళితుడైన కారణంగా చిన్న చూపుతో అవమానించటం ఆయన స్థాయికి తగదన్నారు. అధికారం ఉందని నోరు జారడం సరి కాదని, నోటిని అదుపులో పెట్టుకొని మాట్లాడాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. కులాలు మతాలు చూసి అధికారులతో వ్యవహరించడం ఎమ్మెల్యే ఏలేటికే చెల్లిందన్నారు.

## కామన్వెల్త్ గేమ్స్.. మీరాబాయి చానుకు స్వర్ణం

**ముద్ర, ఢిల్లీ :** కామన్వెల్త్ క్రీడల్లో 2026లో భారత్‌కు మీరాబాయి చాను తొలి స్వర్ణం అందించింది. మహిళల వెయిట్ లిఫ్టింగ్ 48 కేజీల విభాగంలో మీరాబాయి చాను 190 కేజీల బరువు ఎత్తి స్వర్ణ పతకం సొంతం చేసుకుంది. రూత్ అసుక్వో న్యోంగ్ (నైజీరియా, 168 కేజీలు) రజతం, ఐరీన్ జేన్ హెన్రీ (మలేసియా, 167 కేజీలు) కాంస్య పతకాలు సాధించారు. కామన్వెల్త్ క్రీడల్లో మీరాబాయికిది వరుసగా మూడోసారి గోల్డ్ మెడల్ కావడం విశేషం. 2018 (గోల్డ్ కోస్ట్), 2022 (బర్మింగ్‌హామ్)లోనూ ఆమె స్వర్ణ పతకం గెలుచుకుంది. రెజ్లర్లు సుశీల్ కుమార్ (2010, 2014, 2018), వినేశ్ ఫొగాట్ (2014, 2018, 2022) తర్వాత కామన్వెల్త్ క్రీడల్లో హ్యాట్రిక్ గోల్డ్ మెడల్స్ సాధించిన మూడో భారత అథ్లెట్‌గా చాను రికార్డు సృష్టించింది.




# దివ్యాంగులను సమానత్వ దృక్పథంతో చూడాలి

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..**

**దివ్యాంగులకు నియో ఫ్లై బోల్ట్ పవర్ వీల్‌చైర్ల పంపిణీ చేసిన మంత్రి అడ్లూరి, ఎమ్మెల్యే నవీన్ యాదవ్**

ముద్ర, హైదరాబాద్: దివ్యాంగులను సమాజంలో సానుభూతితో కాకుండా సమానత్వ దృక్పథంతో చూడాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు.దివ్యాంగులకు చేయూత ఇచ్చే కార్యక్రమంలో భాగంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్‌గూడ మహమూద్ ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో హ్యుందాయ్ మొబిస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన (యాక్సెసిబిలిటీ అండ్ ఫ్రీడమ్) కార్యక్రమంలో దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశారు.



తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, దివ్యాంగులు, వృద్ధులు & ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 90 మంది దివ్యాంగులకు నియో ఫ్లై బోల్ట్ పవర్ వీల్‌చైర్లను ఈసందర్భంగా హైదరాబాద్ లో జరిగిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం, సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది అన్నారు. ప్రభుత్వంతో పాటు కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతలో భాగంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినంద నీయ మన్నారు. మానవతా దృక్పథంతో కాకుండా సమానత్వ దృక్పథంతో చూడాలని మంత్రి అడ్లూరి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్ చిన్న శ్రీశైలం యాదవ్, జాతీయ దివ్యాంగుల హక్కుల సంఘం అధ్యక్షులు తుడుం రాజేందర్, దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షఫీ అహ్మద్ ఖాన్, ప్రభాంజాన, జయశ్రీ పాల్గొన్నారు.

## జలదిగ్బంధంలో గండిపోశమ్మ ఆలయం

ముద్ర, అమరావతి: పోలవరం జిల్లా దేవీపట్నం మండలంలో ఉన్న గండిపోశమ్మ అమ్మవారి ఆలయం జలదిగ్బంధంలో చిక్కుకుంది. గోదావరికి ఎగువ నుంచి వస్తున్న వరదతో ఆదివారం ఉదయానికి ఆలయంలో భారీగా నీరు చేరింది. అమ్మవారి అంతరాలయంలో విగ్రహం మెడ వరకూ వరద చేరడంతో అర్చకులు అప్రమత్తమయ్యారు. ఆలయ మండపం, భక్తుల క్యూలైన్లలోకి భారీగా వరద నీరు చేరడంతో దర్శనాలను నిలిపివేశారు. భక్తులు రావద్దని సూచించారు.

## పేకాటస్థావరంపై పోలీసుల మెరుపు దాడి..

*** 12మందిపై కేసు నమోదు..**

*** 26వేల నగదు స్వాధీనంతోపాటు 11ఫోన్లు సీజ్..**

*** వివరాలు వెల్లడించిన చిగురుమామిడి ఎస్సై జగదీశ్వర్..**

**ముద్ర చిగురుమామిడి:**

మండల పరిధిలోని రేకొండ గ్రామంలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న పేకాట స్థావరంపై చిగురుమామిడి ఎస్సై జగదీశ్వర్ ఆధ్వర్యంలో శనివారం అర్ధరాత్రి మెరుపు దాడి నిర్వహించారు. నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు జరిపిన ఈ దాడిలో మొత్తం 12మంది పేకాటరాయుళ్లను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని అరెస్ట్ చేశారు.వారి వద్ద నుండి 26వేల రూపాయల నగదుతోపాటు, జూదానికి ఉపయోగిస్తున్న 11స్మార్ట్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఎస్సై జగదీశ్వర్ హెచ్చరించారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.




## నీట్ లో ఉత్తమ ర్యాంక్ సాధించిన దేగామ శ్రీనుత



**ముద్ర, కోరుట్ల;** కోరుట్ల పట్టణానికి చెందిన శ్రీ శివమార్కండేయ, కోటినవదుర్గ దేవాలయ ప్రధాన అర్చకులు దేగామ ప్రదీప్ శర్మ – లక్ష్మీ శరణ్య దంపతుల కుమార్తె దేగామ శ్రీనుత ఇటీవల విడుదలైన నీట్ పరీక్ష ఫలితాల్లో 577 మార్కులు సాధించి ఆల్ ఇండియా 19537 ర్యాంకు సాధించింది. అలాగే ఈ డబ్ల్యూ ఎస్ కోటాలో 2251 ర్యాంకు సాధించింది. శ్రీనుత పదవ తరగతి వరకు స్థానిక అక్షర హైస్కూల్ కోరుట్ల లో చదివి ఇంటర్మీడియట్ హైదరాబాద్ లోని నారాయణ కాలేజీలో చదివి నీట్ లో ర్యాంక్ సాధించడంతో కోరుట్ల పట్టణానికి చెందిన పద్మశాలి కులోన్నతి సంక్షేమ సంఘ అధ్యక్షులు గుంటుక ప్రసాద్, శ్రీ శివమార్కండేయ కోటినవదుర్గ దేవాలయ చైర్మన్ జిల్లా ధనుంజయ గారు శ్రీనుతను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి బండ్ల రవికుమార్, కోశాధికారి అందె రాజ్ కుమార్, అర్చకులు ప్రదీప్ శర్మ, శ్రీధర్ శర్మ, ఆలయ కమిటీ డైరెక్టర్ ఆడెపు నరేష్ కుమార్, పద్మశాలి యువత అధ్యక్షులు జక్కుల ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులు బండి సురేష్, ప్రధాన కార్యదర్శి చింతకింది ప్రేమ్ కుమార్, కార్యవర్గ సభ్యులు గాజెంగి మనీష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్గిల్ అమరవీరులకు నివాళులు



**ముద్ర, కోరుట్ల;** భారతీయ జనతా పార్టీ కోరుట్ల పట్టణ అధ్యక్షులు కస్తూరి లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో కార్గిల్లో అమరులైన జవాన్లకు కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1999లో లడఖ్‌లోని ఉత్తర కార్గిల్ జిల్లా పర్వత శిఖరాలపై పాకిస్తానీ దళాలు ఆక్రమించిన స్థానాల నుండి వారిని తరిమికొట్టి, కార్గిల్ యుద్ధంలో పాకిస్తాన్‌పై భారతదేశం సాధించిన విజయాన్ని పురస్కరించుకుని, భారతదేశంలో ప్రతి సంవత్సరం జూలై 26న కార్గిల్ విజయ్ దివస్ జరుపుకుంటారనీ అన్నారు. ఈ కార్యక్రమంలో ధార్మిక జిల్లా కన్వీనర్ మడవేని నరేష్, పట్టణ ప్రధాన కార్యదర్శులు ఎర్ర రాజేందర్, చెట్లపెల్లి సాగర్, మ్యాకాల గణేష్, గాందే నవీన్, పోతుగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ పాఠశాలలో ముగిసిన సీబీఎస్సీ క్లస్టర్ 7 ఖో-ఖో పోటీలు

**ముద్ర, కరీంనగర్ :** క్రీడలు విద్యార్థుల యొక్క జీవితాన్ని చాలా ప్రభావితం చేస్తుందని .. వారి యొక్క విజయాలను సైతం నిర్ణయిస్తుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి గారు స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్నటువంటి సీబీఎస్ఈ క్లస్టర్ 7 ఖో–ఖో పోటీల ముగింపు సందర్భంగా నిర్వహించినటువంటి బహుమతుల ప్రధానోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు చాలా ఉపయోగపడతాయని అదే విధంగా ఉపాధి అవకాశాలు సైతం మెరుగుపడతాయని వారు గుర్తు చేశారు. క్రీడల యొక్క ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు వివిధ స్థాయిలలో నిర్వహింపబడేటువంటి పోటీలకు ప్రోత్సాహం అందించడమే కాకుండా గెలుపు దిశగా పయనించేందుకు ప్రత్యేక శిక్షణ ఇప్పించడం జరుగుతుందని వారు చెప్పారు.

అదే విధంగా గత మూడు రోజులుగా ఓరాహోనీగా కొనసాగుతున్నటువంటి సీబీఎస్ఈ క్లస్టర్ 7 ఖో–ఖో పోటీలు ఘనంగా ముగిశాయని మరియు క్రీడాకారులు వారి యొక్క క్రీడా స్ఫూర్తిని చాలా గొప్పగా ప్రదర్శించడం టోర్నమెంట్ కు వన్నె తెచ్చిందన్ని వారు చెప్పారు.
. పాఠశాల నుంచి వచ్చేసినటువంటి విద్యార్థులు వారి యొక్క సంకల్పాన్ని ప్రదర్శించి పోటీలలో పాల్గొన్నారని చెప్పారు. ఎటువంటి లోటు లేకుండా విద్యార్థులందరికీ వసతులు కల్పించడం జరిగిందని మరియు విద్యార్థులు సైతం వారి యొక్క సహకారాన్ని అందించారని చెప్పారు.

టోర్నమెంట్ను జయప్రదం చేసినటువంటి రెఫరీలకు, మేనేజర్లకు, ఎంపైర్లకు, కోచ్లలకు, వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్ ,విద్యార్థులకు కృతజ్ఞతలు తెలియజేశారు.







**వివిధ కేటగిరీల విజేతలు**

అండర్ 14

1. ప్రథమ స్థానం: ఏకశిలా హై స్కూల్, వర్ధన్నపేట
2. ద్వితీయ స్థానం & రన్నరప్: ఢిల్లీ పబ్లిక్ స్కూల్, నాచారం, మల్కాజ్గిరి, తెలంగాణ
3. తృతీయ స్థానం: ఎస్సార్ విద్యానికేతన్, గద్వాల్, తెలంగాణ
4. నాలుగో స్థానం: అక్షర వాగ్దేవి ఇంటర్నేషనల్ స్కూల్ సికింద్రాబాద్

**అండర్ 17 విజేతల వివరాలు**

1. ప్రథమ స్థానం: మాంటిస్సోరి ఎలైట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల, రాపాడు, అనంతపురం జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం
2. ద్వితీయ స్థానం & రన్నరప్: సూర్య అకాడమీ, బాచుపల్లి, హైదరాబాద్ తెలంగాణ
3. తృతీయ స్థానం: బివి భువన్ రెసిడెన్సి, తాడేపల్లిగూడెం, ఆంధ్ర ప్రదేశ్
4. పల్లవి స్కూల్, బండ్లగూడ, కీసర, రంగారెడ్డి జిల్లా

**అండర్ 19 విజేతల వివరాలు:**

1. ప్రథమ స్థానం: శ్రీ ప్రకాష్ విద్యానికేతన్, ఆంధ్ర ప్రదేశ్
2. ద్వితీయ స్థానం & రన్నరప్:. పల్లవి మోడల్ స్కూల్, అల్వాల్ సిటీ, సికింద్రాబాద్.
3. . తృతీయ స్థానం: అక్షర విద్యాలయ నెల్లూరు, ఆంధ్రప్రదేశ్.
4. నాలుగో స్థానం: ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, హనుమకొండ

ఈ కార్యక్రమంలో వి.సూర్య ప్రకాష్ గారు, తెలంగాణ రాష్ట్ర ఖో–ఖో అసోసియేషన్ రెఫరీస్ బోర్డ్ కన్వీనర్, ఎం.భరత్ కుమార్ గారు, సీబీఎస్ఈ పరిశీలకులు, కే. నరేష్ గారు, భారతీయ మహిళా జట్టు కోచ్, వివిధ జట్ల కోచ్ లు, మేనేజర్లు, వివిధ పాఠశాలల పిఈటీలు, ప్రిన్సిపాల్స్, మరియు క్రీడాకారులు పాల్గొన్నారు

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
సోమవారం 27.07.2026
www.mudranews.in | @mudranews



**నిద్రలేమి సంకేతాలు :**
రోగ నిరోధక శక్తి తగ్గడంత గినంత నిద్ర లేకపోతే శరీర రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది. ఫలితంగా జలుబు, దగ్గు, జ్వరం వంటి ఇన్‌ఫెక్షన్లు తరచూ రావడంతో పాటు ఆరోగ్యం త్వరగా దెబ్బతింటుంది.



# పోలీసు సిబ్బందికి ఉచిత వైద్య శిబిరం

**లివర్ ఫైబ్రోస్కాన్, ఆరోగ్య అవగాహన సదస్సు**
**ప్రారంభించిన జిల్లా ఎస్పీ నరసింహ**



**ముద్ర, సూర్యాపేట:** పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల ఆరోగ్య సంక్షేమమే లక్ష్యంగా సూర్యాపేట జిల్లా పోలీసు శాఖ, పట్టణంలోని డివైన్ టచ్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్, అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డివైన్ టచ్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ విజయ మోహన్, సంధ్య మోహన్, డీఎస్పీలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ శిబిరంలో పోలీసు సిబ్బందికి అత్యంత ఖరీదైన లివర్ ఫైబ్రోస్కాన్ పరీక్షలతో పాటు లివర్, రక్త సంబంధిత వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. సుమారు 200 మంది పోలీసు సిబ్బంది ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ, ప్రజల రక్షణ కోసం నిరంతరం విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే ప్రజలకు మరింత సమర్థ వంతంగా, వేగవంతంగా సేవలు అందించ గలరని అన్నారు.మానవ శరీరంలో లివర్ అత్యంత ముఖ్యమైన అవయవమని, సరైన ఆహారపు అలవాట్లు, క్రమం తప్పని వ్యాయామంతో కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని తెలిపారు. విధుల్లో ఒత్తిడిని తగ్గించుకుని కుటుంబ సభ్యులతో కూడా సమయం గడపాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం ఇటువంటి కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని తెలిపారు.పోలీసుల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించిన డివైన్ టచ్ హాస్పిటల్ యాజమాన్యానికి, డాక్టర్ విజయ మోహన్, సంధ్య మోహన్ బృందానికి పోలీసు శాఖ తరపున ఎస్పీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం డాక్టర్ విజయ మోహన్ పోలీసు సిబ్బందికి ఆరోగ్యకరమైన జీవన విధానం, పాటించాల్సిన ఆహార నియమాలు, లివర్ పనితీరు, కాలేయ వ్యాధుల లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరసింహచారి, సీఐ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, జానయ్య, ఆర్ఎస్ఐలు సురేష్, సాయిరాం, కె. అశోక్, ఎం. అశోక్, రాజశేఖర్, అన్వర్, ఎస్ఐలు సందీప్, గోపి, అజయ్‌తో పాటు పెద్ద సంఖ్యలో పోలీసు సిబ్బంది పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

## షిర్డిసాయి మందిరంలో సాయి సత్య వ్రతం



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** గాంధీచౌక్ వరప్రదాత షిర్డిసాయి మందిరంలో 16వ గురుపౌర్ణమి వేడుకలలో భాగంగా ఆదివారం శ్రీ సాయినాధునికి గోధుమలతో అభిషేకం , శ్రీ సాయి సత్య వ్రతం నిర్వహించారు . భక్తిశ్రద్ధలతో సుమారుగా 200 మంది జంటలు శ్రీ సాయి సత్య వ్రతం లో పాల్గొన్నారు. జ్ఞాన సరస్వతి పుట్టపర్తి చాగంటి శ్రీ వెంపల అన్నాజి సాయిరాం చే (పుట్టపర్తి ) ఆధ్యాత్మిక ప్రవచనములు జరిగాయి . ఈ కార్యక్రమానికి భద్రాద్రి బ్యాంక్ చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి , రాజ్యలక్ష్మి అతిధులుగా వచ్చారు . మందిర చైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగాయి . మందిర ప్రధాన పూజారులు కిరణ్ శర్మ , జనార్ధన చార్యులు , అర్వపల్లి నిరంజన్ , పివిడి ప్రసాద్ , కురు వేళ్ళ జగన్ మోహన్ రావు , వేల్పూరి సత్యనారాయణ , డాక్టర్ వేములపల్లి నరేష్ , గన్నవరపు నాగేశ్వరరావు , సిమెంట్ మురళి, ఖమ్మం పుర ప్రముఖులు, పలువురు డాక్టర్స్ పాల్గొన్నారు .

## ఘనంగా పూర్వ విద్యార్ధుల ఆత్మీయ సమ్మేళనం




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి పట్టణంలోని యుపిఎస్ నెంబర్ 3 1993 – 94 సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ పాత జ్ఞాపకాలను నెమ్మర వేసుకుంటూ జ్ఞాపకాలను గుర్తుచేకున్నారు. ఉపాధ్యాయులు మల్లయ్య, మురళిలు మాట్లాడుతూ విద్యార్థులు విద్య నేర్పిన గురువులను గుర్తించుకొని వారు చూపిన బాటలో నడిచి అభివృద్ధి చెందడమే నిజమైన సన్మానమని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు నర్సింగ్ రావు, కిషోర్, సతీష్, వెంకటేష్, రాధిక, అనురాధ, పద్మ, శ్రీనివాస్, శివానాగేందర్, రేణుక, స్వప్న, సుజాత, గణేష్, నర్సింహా, బాలరాజు, శ్రీశైలం పాల్గొన్నారు.

# ప్రజలు బీఆర్ఎస్ అభివృద్ధిని ఎప్పటికీ మరచిపోరు



**- మాజీ మంత్రి పువ్వాడ**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ఖమ్మం నియోజకవరంలో బీఆర్ఎస్ పార్టీని బలహీనపరిచే శక్తి ఎవరికీ లేదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ స్పష్టం చేశారు. ఖమ్మం నగరంలో ఆయన విస్తృతంగా పర్యటించిన అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ జెండా దిమ్మెలను తొలగించడం, గులాబీ జెండాను అడ్డుకోవడం ద్వారా పార్టీని నిలువరించాలనే కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు ఎప్పటికీ ఫలించవని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికార అహంకారంతో ప్రగల్భాలు పలుకుతున్నారని ప్రజల గుండెల్లో బీఆర్ఎస్ పార్టీకి ఉన్న స్థానం ఎవరూ చెరపలేరని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ పార్టీ బీఆర్ఎస్ అని, కోట్లాది మంది ప్రజల ఆశయాలు, త్యాగాల ప్రతీక అయిన గులాబీ జెండాను అని స్పష్టం చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఖమ్మం నగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశామని గుర్తు చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్ వంటి పథకాలతో ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకొచ్చామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా ప్రజలకు చెప్పుకోదగ్గ ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేపట్టలేదని విమర్శించారు. కనీస పారిశుద్ధ్య నిర్వహణలో కూడా ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఖమ్మం నగరంలో అనేక ప్రాంతాలు చెత్తకుప్పలుగా మారిపోయాయని ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## బోనాల మహోత్సవంలో..



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ఖమ్మం నగరంలోని 48వ డివిజన్‌లో ఘనంగా నిర్వహించిన బోనాల మహోత్సవంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకుని రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.అనంతరం భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ ప్రతి ఒక్కరిలో భక్తి భావాన్ని, సామాజిక ఐక్యతను పెంపొందిస్తుందని మాజీ మంత్రి పువ్వాడ అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా బోనాల పండుగకు ప్రత్యేక స్థానం ఉందని, ఈ మహోత్సవం ప్రజల మధ్య సోదరభావాన్ని మరింత బలోపేతం చేస్తాయని చెప్పారు. అమ్మవారి ఆశీస్సులతో ఖమ్మం ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని రైతులకు మంచి పంటలు పండాలని, ప్రతి కుటుంబం ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. వేడుకలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు

## ఈకేవైసీ చేయకుంటే రేషన్ కట్

### రేషన్ కార్డు లబ్ధిదారులకు సూచన

**31 వరకే చివరి అవకాశం**
**మండల పౌర సరఫరాల అధికారి సయ్యద్ ముబీన్**





**ముద్ర, దేవరకొండ:** రేషన్ కార్డులో నమోదైన ప్రతి కుటుంబ సభ్యుడు బయోమెట్రిక్ లేదా ఐరిస్ ధ్రువీకరణను రేషన్ దుకాణంలో లేదా మీ సేవాలో రేషన్ కార్డు ఈ కేవైసీ జులై 31లోపు తప్పకుండ పూర్తి చేయాలని లేని పక్షంలో ఈ కేవైసీ పూర్తి చేయని కుటుంబాలకు రాయితీ రేషన్‌తో పాటు ఆహార భద్రతా కార్డు ద్వారా అందే పలు ప్రభుత్వ సంక్షేమ ప్రయోజనాలు నిలిచిపోయే అవకాశం ఉందని కొండమల్లేపల్లి మండల పౌర సరఫరాల అధికారి సయ్యద్ ముబీన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ సూచనల ప్రకారం రేషన్ కార్డులో నమోదైన ప్రతి కుటుంబ సభ్యుడు తప్పనిసరిగా బయోమెట్రిక్ లేదా ఐరిస్ స్కాన్ ద్వారా ప్రామాణీకరణ పూర్తి చేయాలన్నారు. కుటుంబంలో ఒక్కరి ఇ–కేవైసీ మాత్రమే పూర్తి చేయడం సరిపోదని కార్డులో పేరున్న ప్రతి సభ్యుడి వివరాలను ధృవీకరించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలనుకునే వారు రేషన్ దుకాణం లేదా సమీపంలోని మీసేవా కేంద్రాన్ని సందర్శించవచ్చునని అక్కడ ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ లేదా ఐరిస్ ధృవీకరణ ద్వారా ఇ–కేవైసీ పూర్తవుతుందన్నారు. ఇందుకోసం ఒరిజినల్ రేషన్ కార్డుతో పాటు రేషన్ కార్డులో నమోదైన ప్రతి కుటుంబ సభ్యుడి ఒరిజినల్ ఆధార్ కార్డు వెంట తీసుకెళ్లడం తప్పనిసరి అన్నారు. ఈ కేవైసి ప్రక్రియను పూర్తి చేయడానికి ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఇది పూర్తిగా ఉచితంగానే చేస్తారని కొండమల్లేపల్లి మండల పౌర సరఫరాల శాఖ అధికారి స్పష్టం చేశారు. ఇ–కేవైసీ పేరుతో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే మాకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజమైన అర్హులకే చేరేలా చూడడం నకిలీ లేదా క్రియాశీలంగా లేని రేషన్ కార్డులను గుర్తించడం లబ్ధిదారుల వివరాలను నవీకరించడం కోసం ఈ ఇ–కేవైసీ ప్రక్రియను ప్రభుత్వం చేపట్టిందన్నారు. అందువల్ల గడువు తేదీ వరకు వేచి ఉండకుండా వీలైనంత త్వరగా ఇ–కేవైసీ పూర్తి చేసుకోవాలని రేషన్ కారుదారులకు సూచించారు. జులై 31 తర్వాత ఇ–కేవైసీ పూర్తి చేయని కుటుంబాలకు రేషన్ పంపిణీ ఇతర ఆహార భద్రతా సేవల్లో అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నందున రేషన్ కార్డులో పేరున్న ప్రతి సభ్యుడు తప్పనిసరిగా ధృవీకరణ పూర్తి చేసుకోవడం అవసరమని పౌరసరఫరాల మండల అధికారి సయ్యద్ ముబీన్ పేర్కొన్నారు.

# మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలి

**కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు**




**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికుల శ్రమ దోపిడీకి కారణమైన జీవో నెంబర్ 51 ని రద్దుచేసి మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాల్సిందేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రఘునాధపాలెం లోని గణేష్ గార్డెన్ లో జరిగిన తెలంగాణ రాష్ట్ర గ్రామపంచాయతీ ఉద్యోగ & కార్మిక సంఘం (ఏఐటియుసి) 3 వ రాష్ట్ర మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా పాలొని ప్రసంగించారు. తొలుత ఏఐటీయూసీ జెండాను ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసఫ్ ఆవిష్కరించగా అనంతరం గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టంగుటూరీ నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన మహాసభలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాలను కాపాడటంకై అనునిత్యం పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికులకు అత్యధిక వేతనం ఇవ్వాల్సింది పోయి అత్యల్ప వేతనాలు ఇవ్వడం సరికాదు అన్నారు. కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని అన్ని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తుంటే పంచాయతీ కార్మికులకు 8500 రూపాయలు ఇవ్వడం ఏంటని ఆయన ప్రశ్నించారు. కనీస వేతన చట్టం కూడా నెలకు 16 వేల రూపాయలు ఇవ్వాలని చెబుతున్నా విషయాన్ని ఆయన గుర్తు చేశారు. త్వరలో అసంఘటితరంగా కార్మికులను సమన్వయపరిచి కనీస వేతనం కొరకు రాష్ట్రవ్యాప్త పోరాటం చేయనున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు . పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందన్నారు. కొన్ని మేజర్ పంచాయితీలు కార్మికులకు ఎక్కువ వేతనాలు ఇచ్చే సమయంలో వాటిని కూడా ఇవ్వద్దని రాష్ట్ర ప్రభుత్వం అడ్డుపడటం విడ్డూరంగా ఉందన్నారు. కార్మికుల రక్తం పీల్చే జీవో నెంబర్ 51ని తొలగించి మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, కొత్తగూడెం నగరం మేయర్ మూడు గణేష్, ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. జి. క్లెమెంట్ , వెంకట రాజం జిల్లా కార్యనిర్వాక అధ్యక్షులు రావి శివరామకృష్ణ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు రాష్ట్ర సమితి సభ్యులు సిహెచ్ సీతా మహాలక్ష్మి, నిమ్మటూరి రామకృష్ణ, మల్లికార్జున్, గ్రామపంచాయతీ ఉద్యోగ , కార్మిక సంఘం నాయకులు వాసిరెడ్డి మురళి, పిట్టల మల్లయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, రఘునాధ పాలెం మండల కార్యదర్శి శ్రీని

## సామూహిక బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా భువనగిరి పట్టణంలో కుమ్మరి కులస్థులు భక్తి శ్రద్ధలతో నిర్వహించిన సామూహిక బోనాల మహోత్సవంలో భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాడూరి నర్సింహా ఆహ్వానం మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన బోనాల పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు. ఇలాంటి పండుగలు సమాజంలో ఐక్యత, ఆధ్యాత్మికత, సాంస్కృతిక విలువలను మరింత పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అమ్మవారి కృపాకటాక్షాలతో భువనగిరి నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రజాప్రతినిధులు,సీనియర్ నాయకులు, కుమ్మరి సంఘం ప్రతినిధులు, మహిళలు, భక్తులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
సోమవారం 27.07.2026
www.mudranews.in | @mudranews



**నిద్రలేమి సంకేతాలు :**



చిరాకు, మానసిక ఒత్తిడి పెరగ డంచిన్న విషయానికే కోపం రావడం, ఆందోళన లేదా ఒత్తిడి ఎక్కువ కావడం నిద్రలేమి ప్రభావమే. మూడ్ తరచూ మారడం వల్ల కుటుంబం, కార్యాలయంలో సంబంధాలపై కూడా ప్రభావం పడుతుంది.

## గాజుల అలంకరణలో అమ్మవారు



తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ ఏడుపాయల వనదుర్గ భవాని మాత గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడ ఉత్సవాలలో భాగంగా ప్రతి ఆదివారం ఒక్కో అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తున్నారు. రెండవ ఆదివారం గాజులతో అలంకరించారు. ఉదయం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, అలంకరణ, మహా మంగళహారతి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉదయం నుండి భక్తులు వేలాదిగా అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు.

- ముద్ర ప్రతినిధి, మెదక్

# బీజేపీలోకి భారీగా చేరికలు

**కాషాయ కండువా కప్పిన జిల్లా అధ్యక్షులు ఊట్కూరి అశోక్ గౌడ్**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** యాదాద్రి భువనగిరి జిల్లాలో వివిధ పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారతీయ జనతా పార్టీలో భారీ చేరారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో వారికి జిల్లా అధ్యక్షులు ఊట్కూరి అశోక్ గౌడ్ కాషాయ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అశోక్ గౌడ్ మాట్లాడుతూ దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రజా రంజక పాలన, దేశవ్యాప్త అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రజలు, యువత పెద్ద ఎత్తున బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని స్పష్టం చేశారు. జిల్లాలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్టీ సెల్ కార్యదర్శి దారావత్ జైహింద్, సుమన్, అశోక్, సంతోష్, మల్లేష్, శ్రీశైలం, రెడ్డి, షార్బుల్, డి. రమేష్, ప్రవీణ్, ఆలేరు నియోజకవర్గం నుండి యెలా ప్రవీణ్, డి.మనోజ కుమార్, శివకుమార్, దుర్గాప్రసాద్ లతో పాటు 50మంది కార్యకర్తలు చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ గుప్తా, ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షులు అజమీర్ కిషన్ నాయక్, భువనగిరి మండల అధ్యక్షులు చిరక సురేష్ రెడ్డి, మండల నాయకులు అనిల్ గౌడ్, వెంకటేష్ నాయక్, మాణిక్యం రెడ్డి, భువనగిరి సిద్దూ, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# అవార్డులు అందుకున్న డాక్టర్ ర్యాకల

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** సామాజిక వేత్త, ఆర్ ఎస్ కె ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ కి మరొక అరుదైన గుర్తింపు దక్కింది.హైదరాబాద్ ఆదర్శ కళా నిలయం వారు ప్రతి యేటా ఇచ్చే 'రాజసింహా అవార్డు' – 2026 సంవత్సరానికి గాను "ఆదర్శ స్వర్ణ నంది అవార్డు" కు శ్రీనివాస్ ఎంపికయ్యారు. ఆదివారం యాదగిరిగుట్టలోని సీఎం గ్రాండ్ హోటల్లో ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య చేతుల మీదుగా ఈ అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ తాజ్ పూర్ గ్రామానికి చెందిన సామాజికవేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ చేస్తున్నటువంటి ఎన్నో సేవా కార్యక్రమాలు ఎంతోమందికి ఆదర్శనీయమని, సమాజం పట్ల వారి సేవా దృక్పథం అభినందనీయమని, ఇలాంటి అవార్డులు వారికి ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తాయన్నారు. సాధారణ కుటుంబంలో జన్మించి ఈ స్థాయికి ఎదగడం అనేది చాలా గొప్ప విషయమని కొనియాడారు. ఈ సందర్భంగా అవార్డులు అందుకున్న డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ మాట్లాడుతూ నాకు ఈ అవార్డులు మునుముందు భవిష్యత్తులో ఇంకా ఎన్నో సేవా కార్యక్రమాలు చేయడానికి బలాన్ని చేకూర్చుతాయని, నిర్వాహకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత, యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్, వైస్ చైర్మన్ బరిగే రమ్య రామచందర్, స్థానిక కౌన్సిలర్లు పాల్గొన్నారు.



# రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు



**ముద్ర, వరంగల్:** ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి చదరంగ పోటీలకు ఎనిమిదిమంది విద్యార్థులు ఎంపికయ్యారని చదరంగ సమాఖ్య వెల్లడించింది. ఆదివారం చెస్ సమాఖ్యం ఆధ్వర్యంలో హనుమకొండలోని మాస్టర్‌జీ స్కూల్‌లో నిర్వహించిన అండర్–13 జిల్లాస్థాయి చదరంగ పోటీల్లో ప్రతిభ కనబరిచిన నలుగురు బాలురు, నలుగురు బాలికలు రాష్ట్రస్థాయికి అర్హత సాధించారని నిర్వాహకులు తెలిపారు. చదరంగం పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరైన డాక్టర్ బి.ఏలియా, సేజ్‌హై స్కూల్ డైరెక్టర్ మోహన్‌రెడ్డి, జనగామ కెస్ట్ మిత్ర ఫౌండర్ మధు విచ్చేసి విజేతలకు బహుమతులను అందజేశారు. చదరంగం పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం అనంతరం కార్యదర్శి కన్నా మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 50మంది క్రీడాకారులు పాల్గొన్నారని అండర్–13లో బాలుర విభాగం నుంచి శ్రీసాయి ప్రీతం కనకాల, శ్రియన్ రామ్ శివరాత్రి, అక్షిత్ హన్ లావుడియా, దావల్ సాయి ఊరుగొండ బాలికల విభాగం నుంచి ఆద్య అనిశెట్టి, వెన్నమల్ల దిలీషా, మునిగాల అక్షర, సహస్ర కైరంకొండ రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని ఆయన వెల్లడించారు. ఆగస్టులో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు వరంగల్ జిల్లా నుంచి ఈ ఎనిమిది ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. చీఫ్ ఆర్బిటర్ ప్రేమ్‌సాగర్, డాక్టర్ షణ్ముఖ, కైరంకొండ రాము పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో చిరుతపులి మృతి





**ముద్ర ప్రతినిధి, మెదక్:** రోడ్డు ప్రమాదంలో చిరుత పులి మృతి చెందిన సంఘటన ఆదివారం మెదక్ జిల్లా రామాయంపేట మండలం తొనిగండ్ల శివారులో చోటు చేసుకుంది. అడవిలో నుంచి వచ్చిన చిరుత రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు బలమైన గాయమై చిరుత అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలిసిన వెంటనే రామాయంపేట పోలీసులు, ఫారెస్ట్ ఆఫీసర్లు అక్కడికి చేరుకుని పంచనామా నిర్వహించారు. చనిపోయిన చిరుతపులి మృత దేహానికి అక్కన్నపేట అర్బన్ పార్క్ లో హవెలి ఘనపూర్ వెటర్నరీ డాక్టర్ నిస్సి జోషితో పోస్టుమార్టం చేయించారు. అనంతరం దానిని అక్కడే దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అటవీ శాఖ అధికారి జోజి మాట్లాడుతూ. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన చిరుత పులి వయసు రెండు నుంచి మూడేళ్ల మధ్యన ఉంటుందని తెలిపారు. చనిపోయిన చిరుత పులి ఆడదని చెప్పారు. చిరుతపులి మృతిపై రామాయంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.రామాయంపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ విద్యాసాగర్, కుత్బొద్దీన్, మెదక్ ఎఫ్ఎస్ఓ స్రవంతి సందర్శించారు.

## 27 నుంచి రైతు వేదికలలో విత్తన మేళాలు

**కలెక్టర్ ప్రతిమా సింగ్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుండి 29 వరకు జిల్లాలోని 12 రైతు వేదికల్లో విత్తన మేళా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం వలన వర్షపాతం లోటు ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడం ఈ విత్తన మేళా యొక్క ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.తక్కువ నీరు – ఎక్కువ లాభం ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయాలని సూచించారు.రైతులు సాంప్రదాయ వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తే వర్షాభావ పరిస్థితుల్లోనూ నష్టపోకుండా ఆర్థికంగా లాభపడవచ్చని సూచించారు.

## టీజీసీజీటీఏ సిద్దిపేట జిల్లా నూతన కార్యవర్గం




**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యావర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సిద్దిపేట జిల్లా అధ్యక్షులుగా డాక్టర్ యం శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శిగా పిట్ల దాసు, కోశాధికారిగా డాక్టర్ సిహెచ్ మధుసూదన్, ఉపాధ్యక్షురాలుగా డాక్టర్ డి శ్రీలత ఎన్నికయ్యారు. అధ్యక్షులు శ్యాంసుందర్ మాట్లాడుతూ తమను ఎన్నుకున్నందుకు జిల్లాలోని అధ్యాపకులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రధాన కార్యదర్శి పిట్ల దాసు మాట్లాడుతూ ఇటీవల జిల్లాలోని వివిధ కళాశాలలో యూనిట్ అధ్యక్షులు కార్యదర్శులుగా ఎంపికైన వారికి శుభాకాంక్షలు తెలిపి రాష్ట్ర కార్యవర్గానికి అధ్యాపకులకు అనుసంధానకర్తలుగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట కళాశాల యూనిట్ అధ్యక్షులు డాక్టర్ ఉమామహేశ్వరి, కార్యదర్శి డాక్టర్ డి పవన్ కుమార్, సత్య నారాయణ రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, రామచంద్రం, డాక్టర్ బాలచంద్రం, శ్రీలత, డాక్టర్ సునీత, డాక్టర్ స్రవంతి, ప్రొఫెసర్ పి అయోధ్య రెడ్డి, ప్రొఫెసర్ మట్ట సంపత్ కుమార్ రెడ్డి, ఎన్ వెంకటరమణ తో పాటు జిల్లాలోని వివిధ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## బీరన్నకు తొలి బోనం

**బోనమెత్తిన మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని**

**ముద్ర, వరంగల్:** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉర్సు, కరీమాబాద్, రంగశాయిపేట ప్రాంతంలోని కురుమ కులస్తులు తమ ఇలవేల్పు అయిన బీరన్న స్వామికి భక్తి శ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఉదయం ఉర్సులోని కురుమ కుల సంఘం అధ్యక్షుడు యేర కోటేశ్వర్ ఆధ్వర్యంలో జెండా చేత బూని స్వామి వారికి పట్టువస్త్రాలు, బండారి, కంకణాలను అందజేశారు.



అనంతరం సాయంకాలం మహిళలు నెత్తిన బోనాలతో ఆలయానికి తరలివెళ్లారు. దారి పొడవునా డప్పుచప్పుళ్లు మార్మోగాయి. బీరన్నల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కురుమ కుల పెద్ద మరుపల్ల రవి బోనం ముందు సాగగా బోనాలు ఆలయానికి బయలుదే రాయి. స్వామి వారికి నైవేద్యం సమర్పించి తిరిగి ఇళ్లకు బయలుదేరారు. కరీమాబాద్‌లోని ఆలయ కమిటీ సభ్యులు ఉదయం జాతీయ జెండాను చేతబూని ఆలయానికి వెళ్లి ఆలయంలోని చెట్టుకు జెండాను కట్టారు. అనంతరం సాయంకాల రామస్వామి కుల పెద్ద బోనం ముందు రాగా గుడి నుంచి బోనాలు బయలుదేరాయి. ఊరంతా తరలివచ్చి బోనాలను, బీరన్నల విన్యాసాలను ఆసక్తిగా తిలకించారు. బోనాలు బురుజు సెంటర్‌లోకి రాగానే బీరన్నలు గొర్రెను గావు పట్టారు. గావును చూసేందుకు వందలాది మంది జనం అక్కడకు వచ్చారు. అనంతరం గావు పట్టిన గొర్రె పిల్లను బోనాలతో దాటుతూ మహిళలు ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో స్వామివారి కల్యాణం నిర్వహించి కురుమలు ఇళ్లకు బయలుదేరారు. రంగశాయిపేటలో మహిళలు నెత్తిన బోనాలతో ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి ఏటా బీరన్న స్వామికి బోనాలు చేయడం ఆనవాయితీగా వస్తుందని కురుమలు తెలిపారు. రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ మేయర్ గుండు సుధారాణి, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, బీజేపీ నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు బోనమెత్తారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555